



ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, జవహర్





ఇసుకాసురుడు!

ప్రభుత్వం మారినా..ఫ్యాన్ నేతదే పెత్తనం

- కాకినాడకు రెండు రీచ్‌లు
- పొడగట్లపల్లి,కాటవరం కేటాయింపు
- అక్కడ వైసీపీ నేత గుత్తాధిపత్యం
- ద్వారంపూడి అనుచరుడి దందా
- తెరముందు వేరే కంపెనీలు
- తెరవెనుక ఇష్టారాజ్యం
- స్టాక్‌యార్డులకు ఇసుక ససేమిరా
- ఇసుక అందక ప్రజల ఇబ్బందులు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ప్రభుత్వం మారినా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కొన్ని ఇసుక రీచ్‌లపై వైసీపీ నేతల పెత్తనం కొనసాగుతూనే ఉంది. ఏ మాత్రం జంకుబొంకు లేకుండా అధికారుల సాయంతో రీచ్‌లపై పెత్తనం చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వం మారినా ఆధిపత్యం చలాయిస్తున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇసుక, గ్రావెల్ తవ్వకాల్లో హవా కొనసాగించిన కాకినాడ సిటీ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి అనుచరుడు ఇప్పుడు తనకు ఎదురులేదన్నట్టు వ్యవహరిస్తున్నాడు. కాకినాడ జిల్లాలో స్టాక్‌యార్డులకు ఇసుక సరఫరా చేసేందుకు కేటాయించిన రెండు ర్యాంపుల్లో పాగావేసి అడ్డగోలుగా వ్యవహరిస్తున్నాడు.స్టాకుయార్డు నిర్వాహకులకు ఇసుక ఇవ్వాల్సి ఉండగా నిరాకరిస్తున్నారు. ఆ ఇసుకను విశాఖతో పాటు ఇతర ప్రాంతాలకు అడ్డగోలుగా విక్రయించేసుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా యార్డులను దక్కించుకున్న నిర్వాహకులు జనానికి ఇసుక సరఫరా చేయలేక తలపట్టుకుంటున్నారు.

ప్రభుత్వం చేసిందిదే..

చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇసుక విధానంలో మార్పు తీసుకువచ్చింది. ఇసుక ఉచితంగా తవ్వుకునేలా ఆదేశాలిచ్చింది. వర్షాకాలంలో ఇసుకకు ఇబ్బందులు లేకుండా నియోజకవర్గాల్లో స్టాకుయార్డులను ఏర్పాటు చేసింది. వర్షాలు రావడానికి ముందే రీచ్‌ల నుంచి ఇసుక తెచ్చి వీటిలో నిల్వ చేసుకునేలా ఆదేశాలు జారీచేసింది.అందులో భాగంగా కాకినాడ జిల్లాలో పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురంలోని చిత్రాడ,కరపలోని ఉప్పలంకలో స్టాకుయార్డులకు దరఖాస్తులను ఆహ్వానించి కంపెనీలను ఎంపిక చేసింది. వీటిని దక్కించుకున్న స్టాకుయార్డు నిర్వాహకులకు కోనసీమ జిల్లా రావులపాలెం మండలం పొడగట్లపల్లి,తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం కాటవరం ఇసుక ర్యాంపులను ప్రభుత్వం కేటాయించింది.ర్యాంపుల్లో ఇసుక తవ్వి స్టాకుయార్డు నిర్వాహకులకు విక్రయించేందుకు వీలుగా గనుల శాఖ కొన్ని నెలల కిందట కంపెనీలను ఆహ్వానించింది.పొడగట్లపల్లి ర్యాంపు తేజ ఇన్‌ఫ్రాటెక్, కాటవరం ర్యాంపు మిథులా కన్‌స్ట్రక్షన్ దక్కించుకున్నాయి.రెండు కంపెనీలు ఆయా ర్యాంపుల నుంచి కాకినాడ జిల్లా స్టాకుయార్డులకు ఇసుకను తవ్వి విక్రయించాలి. కానీ ఇక్కడే కథ మలుపు తిరిగింది.

దోపిడీ సాగుతుందిలా..

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆ పార్టీ నేతలు ఇసుకను అడ్డగోలుగా దోచేసి వందల కోట్లకు పడగలెత్తారు. జనానికి ఇసుక దొరకకుండా చేసి అధిక ధరకు విక్రయించేసుకున్నారు.ఇప్పుడూ అదే చేస్తున్నారు. రెండు ర్యాంపులను దక్కించుకున్న కంపెనీలతో తెర వెనుక ద్వారంపూడి అనుచరుడైన ఓ హోటల్‌ను ఇంటిపేరుగా మార్చుకుని హవా చెలాయిస్తున్న నేత ఒప్పందం కుదుర్చుకున్నాడు. రెండు ర్యాంపుల్లో పాగావేసి ఇప్పుడు అడ్డగోలుగా ఇసుక తవ్వేస్తున్నారు. ర్యాంపుల్లో ఇసుక కాకినాడ జిల్లా స్టాకుయార్డులకే ఇవ్వాల్సి ఉండగా బిల్లులు లేకుండా బయటకు అధిక ధరకు విక్ర యించేసుకుంటున్నారు. తీరా తమ స్టాకు యార్డుకు ర్యాంపు నుంచి ఇసుక ఇవ్వాలని వెళుతున్న నిర్వాహకులను బెదిరిస్తున్నాడు. ఇసుక కోసం వెళ్లిన లారీలను సైతం వెనక్కు తిప్పి పంపిచేస్తున్నారు.

అయినా రీచ్‌లు అధికారికంగా దక్కించుకున్న కంపెనీలు విషయం తెలిసి సదరు నేతకు సహకరిస్తున్నాయి. ద్వారంపూడి అనుచరుడు కాకినాడసిటీలో భూదాన్ భూమిలో కేటాయించిన స్టాకుయార్డును గుప్పిట్లో ఉంచుకుని తన ఆధీనంలో ఉన్న రెండు ర్యాంపుల నుంచి భారీగా ఇసుక తరలించేస్తున్నారు. ఇతర స్టాకుయార్డులకు మాత్రం ఇసుక ఇవ్వకుండా గుత్తాధిపత్యం చెలాయిస్తున్నాడు. తాజాగా కాకినాడ సిటీ యార్డును భూదాన్ భూమి నుంచి తరలించాలని హైకోర్టు ఆదేశించడంతో ఇప్పుడు ఆ యార్డును గనులశాఖ రద్దు చేసింది.మరో పక్క వైసీపీ ఐదేళ్ల పాలనలో సదరు నేత అనుచరుడు కాకినాడ జిల్లాలో చెలరేగిపోయాడు. కనిపించిన చెరువులు,కొండల్లో గ్రావెల్ తరలించి కోట్లలో సంపాదించాడు. ఇప్పుడు ప్రభుత్వం మారిన తర్వాత కూడా ఇసుక ర్యాంపులను గుప్పిట పెట్టుకుని సదరు నేత అనుచరుడు అడ్డగోలుగా ఆధిపత్యం చెలాయిస్తున్నా అధికారులు కిమ్మనడం లేదు.

ఎన్‌టీఆర్‌కు ఘన నివాళి



ఎన్‌టీఆర్ ఫొటో ఎగ్జిబిషన్ తిలకిస్తున్న జవహర్, కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్ మే28(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ 102వ జయంతిని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ప్రశాంతి, ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్, జేసీ ఎస్.చిన్నరాముడు తదితరులు ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఎన్టీఆర్ జయంతిని మొదటిసారిగా రాష్ట్ర పండుగగా అధికారికంగా జరుపుకుంటున్నామన్నారు. ఎన్టీఆర్ కేవలం కథానాయకుడు మాత్రమే కాదని, ఒక పరిపూర్ణమైన నటుడన్నారు.వివక్షలేని సమాజం కోసం ఆనాడు తెలంగాణలో పటేల్, పట్వారీ వ్యవస్థ రద్దు చేసి నూతన పాలసీ ఒరవడికి ఎన్టీఆర్ ఆద్యుడయ్యారని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ అన్నారు. ఎన్టీఆర్ వంటి మహానుభావుల జీవితం నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకోవాలని జేసీ చిన్నరాముడు అన్నారు.కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ ఫొటోల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విజయ శంకర సంగీత నృత్యకళాశాల కూచిపూడి నృత్య రూపకం ఆకట్టుకుంది.



పట్టుకుంటే.. పది వేలు!

మందెక్కడ తాగాలి మహాప్రభో

కడుపు నిండా తిండి పెట్టండి.. కంటిపై కునుకు వేస్తే చితక్కొట్టండి.. ఈ డైలాగు ఏదో ఫేమస్ సినిమాలో విన్నట్టుంది కదూ!.అవును.. విలన్‌ని ఉద్దేశించి పోలీస్ అధికారి ఇచ్చే ఆదేశమది. ఇప్పుడు మందుబాబుల పరిస్థితి కూడా కాస్త అటూ ఇటుగా అలాగే ఉంది. పిచ్చి బ్రాండ్లు.. నాసిరకం మందు.. అధిక ధరలతో ఐదేళ్లు విసిగిపోయారు. ప్రస్తుత ప్రభుత్వంలో నాణ్యమైన మద్యం అందుబాటులోకి వచ్చినా స్వేచ్ఛగా తాగడానికి వీల్లేక సతమతమైపోతున్నారు.

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

- పర్మిట్ రూంలు లేక ఇబ్బంది
- బయట తాగితే నేరం..ఫైన్
- చుక్క పడాలంటే సాహసమే
- ఉమ్మడి జిల్లాలో 455 షాపులు
- మందుబాబులు సతమతం
- పోలీస్‌ల నిఘాతో గగ్గోలు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాణ్యమైన మద్యం అందు బాటులోకి వచ్చింది. సుమారు 200 బ్రాండ్లు కళ్లెదుట కనబడుతున్నాయి. కానీ చుక్క గొంతులో పోసుకోవడానికి సాహసం చేయాల్సి వస్తోంది. దీనికి కారణం చుక్క మింగడానికి చోటు లేకపోవడమే. ఇంట్లో అనుమతి ఉండదు.. బయట నాలుక తడుపుకుందామంటే నేరం.. బార్‌లకు వెళదామంటే అదనపు ధరలు.. ఎక్కడో చోట ఏదోలా తాగేసి ఇంటికి పోదామంటే నోట్లో గొట్టం పెట్టి ఊద మనే పోలీసులు.. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం నాణ్యమైన సరుకు..సరసరమైన ధరలు తెచ్చిందని సంతోషించాలా?.. తాగ డానికి జాగా లేదని నొచ్చుకోవాలా అని సగటు మద్యం వినియోగదారుడు ప్రశ్నిస్తున్నాడు. విసిగిపోయి పాలకులపై చిందులేస్తున్నాడు.

ఎక్కడ తాగేది?

వైసీపీ ప్రభుత్వంలో సామాన్యులు క్వార్టరు తాగాలంటే రూ.500 ఆవిరైపోయేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చిన దరిమిలా మందుబాబులకు మళ్లీ మంచిరోజులు వచ్చాయి. అయితే పర్మిట్ రూంలు లేక తాగడానికి ఇబ్బందులు పడుతున్నారు. మద్యం దుకాణాల వద్ద అనధికారికంగా సిట్టింగ్‌లు ఉన్నా బెరుగ్గానే తాగాల్సిన పరిస్థితి ఉంది. బార్‌లకు రెండేళ్ల లైసె న్సును గత వైసీపీ ప్రభుత్వం మంజూరు చే సింది. ఈ ఏడాది సెప్టెంబరు వరకూ బార్‌లకు అనుమతి ఉండడంతో కూటమి కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చే సమయంలో బార్‌లతో ఒక ఒప్పందం జరిగింది. బార్‌ల లైసెన్సు గడువు ముగిసే వరకూ పర్మిట్ రూంలకు అనుమతులివ్వబోమని.తీరా ప్రైవేటు మద్యం షాపులు అందుబాటులోకి వచ్చిన తర్వాత తాగడానికి వీల్లేక నాణ్యమైన మందు దొరుకుతున్నా ప్రభుత్వ ఉద్దేశం పూర్తిగా నెరవేరడం లేదు. కొందరు మద్యం తాగుతారని వాళ్ల ఇళ్లల్లో తెలియకుండా జాగ్రత్త పడతారు. మరి కొం దరికి ఇంట్లో తాగే పరిస్థితులు ఉండవు.చాటుమాటు ప్రదేశంలో మద్యం తాగాలన్నా డేగ కళ్లతో తిరుగుతున్న పోలీసులకు చిక్కామా అంతే. తొలుత కేసు..తర్వాత కోర్టు.. ఆపై రూ.10 వేల ఫైన్. క్వార్టరు మందు రూ.200కే అందుబాటులో ఉన్నా..దానిని ఇంటి బయట గొంతు దాటించాలంటే మాత్రం మరో రూ.15 వేల ఖర్చుకు సిద్ధపడాల్సిందే.ఇప్పుడు ఎక్సైజ్ శాఖ దుకాణాల వద్ద తాగితే ఊరుకోబో మం టూ పెట్రోలింగ్ మొదలుపెట్టింది.ఈ పరిస్థితుల్లో చాలా మంది స్నేహితుల రూంలు,జన సంచారం లేని ప్రాంతాల్లో భయంభయంగానే పని కానిస్తున్నారు.

31% దాటితే రూ.10వేలు

పోలీసులు బ్రీత్ ఎనలైజర్‌తో చెక్ చేస్తుం టారు.రక్తంలోని మద్యం శాతాన్ని అది కొలు స్తుంది.బ్రీత్ ఎనలైజర్‌కి ఉంచే గొట్టంలో ఎవరు ఊదినా బీప్ శబ్దం వస్తుంది. కానీ 31% ఆపై రీడింగ్ చూపిస్తే మాత్రం సదరు వ్యక్తి ఫొటోతో సహా ఆన్‌లైన్‌లో నమోదైపోవడంతో పాటు కేసు నమోదవుతుంది. పోలీసులు చెప్పిన సమయానికి కోర్టుకు వెళితే రూ.10 వేలు ఫైన్. ఆపై బయట 'ఇతర' ఖర్చులూ ఉంటాయి. కల్లు తాగినా, ఓ లైటు బీరు కొట్టినా రీడింగ్ 31 దాటిపోతోందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేసులు 4926..

తూర్పుగోదావరిలో 138, డా.బీ ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 146, కాకినాడ జిల్లాలో 171 మొత్తం మన్యం మినహా ఉమ్మడి తూర్పులో 455 ప్రైవేటు మద్యం దుకాణాలు ఓ 50 బార్లు ఉన్నాయి. డ్రంకెన్ డ్రైవ్ కేసులు ఈ ఏడాది ఇప్పటి వరకూ తూర్పుగోదావరిలో 496 కేసులు నమోదు చేయగా 245 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా వేయగా 16 మందికి జైలు శిక్ష పడింది. 217 కేసులు విచారణ జరగాల్సి ఉంది. కోనసీమలో 1230, కాకి నాడ జిల్లాలో 3200 కేసులు పెట్టగా రూ.20 లక్షల వరకూ మందుబాబులు ఫైన్లు కట్టారు.

ఏరువాక సాగారో!



- 73,812 హెక్టార్లలో వరిసాగు
- 36,906 క్వింటాళ్ల విత్తనాలు
- కాలువల పనులు జాప్యం
- జూన్ 10లోపు నీరు
- 43 వేల బోర్లతో సాగు
- సన్నద్ధమవుతున్న రైతులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

నైరుతి రుతు పవనాలు వస్తుండడంతో జిల్లాలో రైతాంగం ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతోంది. జూన్ నెల వస్తుండడంతో రైతులు ఖరీఫ్‌కు సిద్ధమవుతున్నారు.ప్రతి ఏటా జూన్1న డెల్టా కాలువలకు నీరు విడుదల చేస్తుంటారు. ఈ ఏడాది కాలువల మరమ్మతుల పనులు ఆలస్యంగా ప్రారంభించడంతో నీటి విడుదల జాప్యంకానుంది.ఈ మేరకు జూన్ 10వ తేదీ లోపు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ఖరీఫ్ సీజన్ ఆలస్యం అయ్యేలా ఉంది. అయితే బోర్ల ద్వారా నారుమళ్లు వేసే రైతులు ఉన్నారు. జిల్లాలో ముఖ్యంగా కొవ్వూరు డివిజన్‌తో పాటు రాజానగరం,అనపర్తి, రాజమండ్రి రూరల్ ప్రాంతాల్లో సుమారు 43 వేల బోర్లు ఉన్నాయి. వీటి సహాయంతో నారుమళ్లు వేస్తారు.

ఖరీఫ్ యాక్షన్ ప్లాన్

జిల్లా ఖరీఫ్ సాగుపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్టు జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు తెలిపారు. జిల్లాలో ఖరీఫ్ 2025 పంట కాలానికి సంబంధించి 80,918 హెక్టార్లలో వివిధ రకాల పంటలు వేసే అవకాశం ఉంది. అందులో 77,820 హెక్టార్లలో వరి, 2,595 హెక్టార్లలో మినుము, 181 హెక్టార్లలో ఇతర పంటలు సాగు చేస్తారు. వరికి 38,910 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం. ఇందులో 400 క్వింటాళ్ల విత్తనాలను రైతులకు ప్రభుత్వం రాయితీపై అందిస్తుంది.జిల్లాలో 90 శాతం రైతు వారీ విత్తనాలే ఉంటాయి.10 శాతం లైసెన్స్ విత్తనాల అమ్మకదారుల నుంచి కొనుగోలు చేస్తారు. ఈ సారి సన్నరకాలైన ఎంటీయూ 1224, బీపీటీ 2841, బీపీటీ 2270, బీటీపీ 2846, ఎస్ఎల్ఆర్ 3238 వంటి రకాలతో పాటు ఎంటీయూ 1318 వంటి నూతన రకం సాగు చేయవచ్చని అధికారులు అంచనా వేశారు. భూసార పరీక్షలకు 20,431 నమూనాలు సేక రించడం లక్ష్యంకాగా ఇప్పటి వరకూ 9,050 నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పం పారు.భూసార పరిరక్షణ చర్యల్లో భాగంగా 9 రకాల విత్తనాలతో తయారుచేసిన కిట్లు జిల్లాలో ఇప్పటి వరకూ 14,047 పంపిణీ చేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో జిల్లాకు 64,157 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం.ఇప్పటి వరకూ జిల్లాలో 24,258 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ ఉన్నాయి. జిల్లా పంట సాగుదారు హక్కుల పత్రం (సీసీ ఆర్‌సి)కింద 1,10,000 కార్డులు పంపిణీ చేయ వలసి ఉండగా ఇప్పటి వరకూ 10,958 పంపిణీ చేశారు.

36,906 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం

జిల్లాలో వరి సాగుకు 36,906 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం చేశాం. ప్రైవేట్ డీలర్ల 3690 క్వింటాళ్ల.. రైతు నుంచి రైతుకు 32,816 క్వింటాళ్ల వినియోగానికి సిద్ధంగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా 400 క్వింటాళ్ల విత్తనాలు జూన్ మొదటి వారంలో రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తాం.

- కలెక్టర్ ప్రశాంతి



చేస్తే..ఉపయోగమే!

రాజమహేంద్రవరం, మే 28 (ఆంధ్ర జ్యోతి): యోగా సాధన జీవనంలో ఒక అలవాటుగా మారాల్సిన అవసరం ఉందని జేసీ చిన్న రాముడు అన్నారు.యోగాంధ్రలో భాగంగా బుధవారం ఆర్ట్స్ కళాశాల రోడ్డులో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో యోగా సాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.మానసిక, శారీరక ఇబ్బందులు అధిగమించడానికి యోగా మంచి మార్గమన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సీతారామ మూర్తి, విజయ కుమారి,ఆయుష్ వైద్యుడు రమేశ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ జిల్లా అధికారిగా మూర్తి బాధ్యతలు



రాజమహేంద్రవరం అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ తూర్పుగోదావరి జిల్లా అధికారి (డీపీటీవో)గా వైఎస్ఎన్ మూర్తి బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. తాడేపల్లిగూడెం ఆర్టీసీ డీఎంగా పనిచేస్తున్న మూర్తిని ఉన్నతాధికారులు పదోన్నతిపై ఇక్కడ నియమించారు. జిల్లా అధికారిణిగా పనిచేసిన షర్మిల అశోక కొద్దిరోజుల క్రితం విజయవాడ వర్క్స్ మేనేజర్‌గా బదిలీపై వెళ్లడంతో కోనసీమ జిల్లా ఆర్టీసీ అధికారి రాఘవకుమార్‌కు ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు.జిల్లా ఆర్టీసీ అధికారిగా వైఎస్ఎన్ మూర్తి పూర్తిస్థాయి బాధ్యతలతో కొనసాగనున్నారు.

పని ప్రదేశాల్లో భద్రత తప్పనిసరి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీ లక్ష్మీ

రాజమహేంద్రవరం,మే 28(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ/పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి ఆదేశించారు.డీఎల్ఎస్ఏలో బుధవారం 'పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిషేధ చట్టం-2013'పై పారా లీగల్ వలంటీర్లకు అవగాహన కల్పించారు.సమస్య డీఎల్ఎస్ఏ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎస్ఈబీ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శామ్యూల్

ఇంజనీర్ల పోస్టులు భర్తీ చేయాలి : శామ్యూల్

రాజమహేంద్రవరం సిటీ, మే 28 (ఆంధ్రజ్యోతి): ఏపీలో విద్యుత్ పంపిణీ సంస్థ లతో సహ ట్రాన్స్‌కో -జెన్‌కోతో కలుపుకుని క్షేత్రస్థాయిలో వెయ్యికి పైగా ఏఈల పోస్టులు ఖాళీగా ఉన్నాయని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కపల్లి శామ్యూల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీఎస్ఈబీ ఇంజనీర్స్ అసోసియేషన్ రాజమహేంద్రవరం బ్రాంచ్ సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఇంజనీర్ల నియామకం జరగకపోతే భవిష్యత్‌లో ఆందోళనకర సమస్యలు వస్తాయన్నారు.2022 పే రివిజన్‌తో 1800 మంది ఇంజనీర్లు నష్టపోయారన్నారు విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే యోచనను కేంద్రం విరమించుకోవాలన్నారు.ప్రభుత్వం ఇంజనీర్ల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. సమావేశంలో సంఘ స్టేట్ జనరల్ సెక్రటరీ నాగప్రసాద్, అసోసియేట్ సెక్రటరీ కెవి.రామారావు,రాజమండ్రి బ్రాంచ్ కార్యదర్శి రత్నాలరావు పాల్గొన్నారు.

13 రహదారులకు రూ.24.82 కోట్లు

రాజమహేంద్రవరం రూరల్ మే28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రూ.24.82 కోట్ల నాబార్డు నిధులతో 13 రహదారులకు నిధులు మంజూరు చేసినట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడు నియోజకవర్గాల పరిధిలో 38.61 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణాలు, మరమ్మతులు చేపడతారన్నారు. రంగంపేట మండలంలో మర్లిపూడి-ఆర్వీపట్నం, అనపర్తి మండలం పరిధిలో దుప్పలపూడి-కాపవరం రహదారి పునర్నిర్మాణ పనులకు రూ.3.20 కోట్లతో 6.37 కిలోమీటర్లు, రాజమహేంద్రవరం రూరల్ మండల పరిధి కాతేరు- స్నానఘట్టం వరకు, కడియం మండల పరిధి జేగురుపాడు, కడియం, కె.సావరం,మాధవరాయుడుపాలెం రహదారుల పనులకు గాను రూ.3.30 కోట్లతో 6.02 కిలోమీటర్లు వేస్తారన్నారు. సీతానగరం మండల పరిధి సీతానగరం-పురుషోత్తపట్నం వరకు రూ.3.25 కోట్లతో 3.05 కిలోమీటర్లు, గోకవరం మండల పరిధి గోకవరం-ఆర్.యర్రంపాలెం వరకు రూ.1.50 కోట్లతో 2.80 కిలోమీటర్లు, నల్లజర్ల మండలం పరిధి చోడవరం-గుండెపల్లి, కంచెర్లగూడెం-సంజీవపురం రహదారి నిమిత్తం రూ.3.30 కోట్లతో 5.10 కిలోమీటర్లు, కొవ్వూరు మండలం పరిధి పెనకనమెట్ట- కుమారదేవం బీటీ రోడ్డు పనులకు రూ.2.70 కోట్లతో 3.67 కిలోమీటర్లు, ఉండ్రాజవరం మండలం పరిధిలో పైడిమర్ల-సత్యవాడ, పెరవలి మండల పరిధి కానూరు, నడుపల్లికోట, నిడదవోలు మండల పరిధి సింగవరం- నందమూరు, పెరవలి మండల పరిధి కాపవరం-కొత్తపల్లి అగ్రహారంలో రూ.7.37 కోట్లతో 11.60 కిలోమీటర్ల రహదారుల పనుల చేపడతారన్నారు. ఈ మేరకు నాబార్డుద్వారా నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు.

ఎస్సీ యువతకు లెదర్ ఫుట్‌వేర్‌లో శిక్షణ

రాజమహేంద్రవరం, మే 28 (ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉపాధి నిమిత్తం లీడ్ క్యాప్, సీడాప్ సంస్థల ద్వారా లెదర్ ఫుట్‌వేర్ తయారీ కోర్సులో చేరుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా షెడ్యూల్డు కులాల సహకార సంఘం లిమిటెడ్ కార్యనిర్వాహక సంచాలకులు జె.సత్యవతి తెలిపారు. వివిధ విభాగాల్లో శిక్షణకు పదో తరగతి అర్హతని, వయసు 18-35ఏళ్ల మధ్య ఉండాలన్నారు. గుంటూరు జిల్లా నల్లపాడులోని శ్రీ కృష్ణ సాయి ఎడ్యుకేషన్ సొసైటీలో శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 9030924569 నెంబరులో సంప్రదించాలన్నారు. ఈ మేరకు ఎస్సీ నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పసుపు జాతర



వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ పుస్తకావిష్కరణ

వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ బుక్ చూస్తున్న అచ్చెన్నాయుడు

వేదికపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

రక్తదానం చేసిన వారికి షీల్డు అందిస్తున్న దృశ్యం

మహానాడులో ప్రత్యేక ఆకర్షణ ఎన్టీఆర్ వేషధారి..





రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడపగడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు జనజాతరను తలపిస్తోంది. రెండోరోజు బుధవారం సైతం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. వందల కిలోమీటర్ల నుంచి యువకులు సైకిళ్లపై వచ్చి టీడీపీపై తమ అభిమానం చాటుకున్నారు. యువతులు, మహిళలు పసుపుచీరలు, పచ్చ తలపాగాలతో సందడి చేశారు. దాదాపు లక్షమందికి భోజన ఏర్పాట్లు చేశారు. 'ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి' అంటూ అందరూ భోజనాలను ఆస్వాదించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం'పాదయాత్ర అనుభవాలతో తీసుకొచ్చిన 'వాయిస్ ఆఫ్ నారా లోకేశ్' పుస్తకాన్ని నారా చంద్రబాబు ఆవిష్కరించడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. కడప నగరం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో కిటకిటలాడింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.





మంత్రి సవిత ఆధ్వర్యంలో అనంతపురం నుంచి సైకిళ్లపై వచ్చిన కార్యకర్తలు



నోరూరించే వంటలు రెడీ...



మహానాడు ప్రాంగణం వద్ద వాహనాల రద్దీ

అనంతపురం నుంచి సైకిల్ ర్యాలీగా వచ్చిన వారితో మహిళలు

మేము విజిలేస్తే..

కార్యకర్తల ఉత్సాహం..

రక్తదానం చేస్తున్న కార్యకర్తలు

పోలీసు తనిఖీలు

కాకినాడలో క్రికెట్ పండుగ

కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో 1, 2, 3 తేదీల్లో ఐపీఎల్ ఫ్యాన్ పార్క్ ఈవెంట్... ప్రవేశం ఉచితం: ఎంపీ సతీష్‌బాబు

కార్పొరేషన్ (కాకినాడ), మే 28 (ఆంధ్రజ్యోతి): జూన్ 1, 2, 3 తేదీల్లో గుంటూరులో నిర్వహించాల్సి వున్న రెండు ఐపీఎల్ ఫ్యాన్ పార్క్ ఈవెంట్లు కాకినాడ జిల్లా క్రీడా మైదానానికి మారాయి. రాజ్యసభ సభ్యుడు, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్‌బాబుకు తన ప్రాంతం పైనున్న ప్రేమ, అకుంటిత దీక్ష ఫలితంగా ఇది సాధ్యమైంది. భారీ ఎల్ఈడీ స్ర్కీన్‌లపై ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రదర్శన, సంగీతం, డీజేలు, స్థానిక కళాకారుల ప్రదర్శనలు ఉంటాయి. కాకినాడ స్పెషల్స్‌తో ఫుడ్ కోర్టులు ఏర్పాటుచేస్తారు. కుటుంబానికి అనుకూలమైన కార్యక్రమాలు, పిల్లల కోసం ఆటల పోటీలు. ఉచిత ప్రవేశం, లక్కీడ్రా, ఐపీఎల్ మెర్చండైజ్ బహుమతులు. ఈ క్రికెట్ ఉత్సవాన్ని కాకినాడకు తీసుకురావడం గర్వకారణం మాత్రమే కాదు, భావోద్వేగకరమైన విషయం కూడా. ప్రతి కుటుంబం, యువత, ప్రతి క్రికెట్ అభిమాని ఈ ఉత్సవంలో పాల్గొని కాకినాడ పేరు మార్మోగేలా చేయాలని ఎంపీ సతీష్‌బాబు కోరారు.



కాకినాడలో ఏర్పాటు చేయనున్న భారీ ఎల్ఈడీ స్ర్కీన్



ఒప్పంద అధ్యాపకులతో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అర్జునుడు

కాకినాడ జేఎన్టీయూలో
మూడో రోజుకు ఒప్పంద అధ్యాపకుల నిరసన

జేఎన్టీయూకే, మే 28 (ఆంధ్రజ్యోతి): తమను గతంలో మాదిరిగానే కొనసాగించాలని కోరుతూ కాకినాడ జేఎన్టీయూలో యూసీఈకే, వర్శిటీ ఒప్పంద అధ్యాపకులు చేపట్టిన నిరసన బుధవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సమస్యపై కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ)ని ఒప్పంద అధ్యాపకులు కలిసి వివరించారు. ఒప్పంద అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.అర్జునుడు నిరసనకు మద్దతు తెలిపారు. ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్‌ని కలిసి సమస్యపై చర్చించారు. సాయంత్రం ఆరు గంటల వరకు వేచి చూసినా పరిష్కారం లభించలేదు. గురువారం కూడా నిరసన కొనసాగిస్తామని ఒప్పంద అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ సుధీర్‌కుమార్ చెప్పారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

పి-4 విధానాన్ని ఉపసంహరించుకోవాలి: ప్రజారోగ్య వేదిక సమావేశంలో వక్తల డిమాండ్

కాకినాడ సిటీ, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదని, పి-4 విధానాన్ని ఉపసంహరించుకోవాలని ప్రజారోగ్య వేదిక రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. కాకినాడ యూటీఎఫ్ హోంలో 'ప్రభుత్వ వైద్య కళాశాలలు-ప్రైవేటీ కరణ' అంశంపై బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రజారోగ్య వేదిక నగర కన్వీనర్ పి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు ముఖ్య వక్తగా ప్రసంగించారు. పి-4 విధానంలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడానికి ప్రయత్నించడం సరికాదన్నారు. వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తే వైద్యంలో నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. సమావేశంలో డాక్టర్ గోపీనాథ్, ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక ప్రజా సంఘాల నాయకులు జి.ప్రభాకరవర్మ, కె.సత్తిరాజు, ఎంఏ స్వామి, చంద్రమళ్ల పద్మ, జి.స్వామినాయుడు, జీఎస్ వర్మ, మలక వెంకటరమణ, దుంపల ప్రసాద్, పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

33	19	20	30
22	28	27	25
26	24	23	29
21	31	32	18

ఎటు కూడినా 102

ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా మ్యాజిక్ స్క్వేర్ రూపొందించిన గణితావధాని సాయిరామకృష్ణ



కరప, మే 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 102వ జయంతి సందర్భంగా గణితావధాని, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ మ్యాజిక్ స్క్వేర్ రూపొందించారు. వాడిన సంఖ్యను తిరిగి వాడకుండా రూపొందించిన ఈ చదరంలో నిలువు, అడ్డు, క్రాస్.... ఇలా ఎలా కూడినా నాలుగు సంఖ్యల మొత్తం 102 వస్తుంది. ఎరుపు, పచ్చ, పసుపు గడుల్లోని నాలుగు సంఖ్యలను కలిపినా 102 వస్తుంది. యంగ్ మైండ్స్ స్వచ్ఛంద సంస్థ క్రియేటివ్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న సాయిరామకృష్ణను వ్యవస్థాపక అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ (చిన్న మాస్టారు), సభ్యులు దొడ్డిపట్ల అప్పలరాజు, చింతా నారాయణరావు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు చింతాడ ప్రదీప్‌కుమార్ అభినందించారు.

ఉద్యోగ కల్పనే టాటా ఇన్నోవేషన్ హబ్ లక్ష్యం



టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసే భవనాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

- ఏర్పాట్ల పరిశీలనలో రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, మే 28(ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా రాజమహేంద్రవరంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం సమీపంలోని బొమ్మూరులోని ఆర్టీఐ హెచ్ భవనంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు పనులను కమిషనర్ కేతన్ గార్గ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మొత్తం 4,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆర్టీఐహెచ్ భవనాన్ని ఏర్పాటు చేసుకుంటున్నట్టు తెలిపారు. జూన్ 12న ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు సంబంధించి ఇప్పటికే బోర్డుకమిటీ ఏర్పాటు కాగా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్ఎంసీ కమిషన్ సభ్యులుగా ఉన్నారన్నారు. అలాగే బోర్డు కమిటీ గవర్నింగ్ వ్యవస్థకు గ్రీన్‌కో ఎనర్జీ, ఓఎన్‌జీసీ, గెయిల్, అవంతి తదితరులు ప్రమోటర్లుగా ఉంటారన్నారు. స్కిల్స్ డెవలప్మెంట్, ఇన్నోవేషన్, స్టార్టప్స్ ఫెసిలిటేషన్ కేంద్రంగా ఈ హబ్ ఏర్పాటు కానుందని కమిషనర్ పేర్కొన్నారు. యువతకు ఆసక్తి గల రంగాల్లో దిశనిర్దేశం చేయడం, వారికి తగిన నాలెడ్జి అందించడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లాలో రాజమహేంద్రవరంలో పారిశ్రామిక రంగ అభివృద్ధికి ఈ ఇన్నోవేషన్ హబ్ దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంట ఈఈ మదర్సా ఆలీ, ఇతర అధికారులు ఉన్నారు.

థియేటర్లు బంద్ చేయాలనే ఆలోచన లేదు

- పర్సంటేజీ ఇస్తేనే సినిమా రన్ చేయగలమని మాత్రమే చెప్పాం
- సినీ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ తూర్పు అధ్యక్షుడు బాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాబు

రాజమహేంద్రవరం అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): థియేటర్లను బంద్ చేయాలనే ఆలోచన లేదని, పర్సంటేజీ ఇవ్వకపోతే జూన్ 1 నుంచి సినిమా రన్ చేయలేమని మాత్రమే చెప్పామని సినీ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోళ్ల అచ్యుతరామారావు (బాబు) అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సినిమా థియేటర్లు నడపడం చాలా ఇబ్బందికరంగా మారిందన్నారు. పెద్ద సినిమాలు లేకపోవడం వల్ల ఆదాయం రావడంలేదని, ఆదాయం లేని పరిస్థితుల్లో జూన్ 1 నుంచి థియేటర్లు మూసివేయాలని ఏప్రిల్ 19న జరిగిన సమావేశంలో నిర్ణయించుకున్నామని, ఎవరైనా సినిమా వేసుకుంటే వేసుకోమని కూడా చెప్పామన్నారు. దీనిపై ఏపీ ఫిలిం ఛాంబర్‌కు సమాచారం పంపించామని తెలిపారు. 'డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హరిహర వీరమల్లు సినిమా విడుదలైతే ప్రేక్షకులు వస్తారు. మాకూ పదిరూపాయల వస్తాయి. ఆనందమే అన్నారు. అన్ని థియేటర్లలోనూ పవన్ సినిమా వేస్తాం. ఆ నలుగురితో మాకు సంబంధంలేదు' అని అన్నారు. పెద్ద హీరోలు ఇండస్ట్రీని బతికించాలని, ఏడాదికి కనీసం రెండు సినిమాలు అయినా చేయాలని కోరుకుంటున్నామని అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 180 వరకూ థియేటర్లు ఉంటే వీటిలో 70 వరకూ మాత్రమే నడుస్తున్నాయని, ఇవి కూడా ఆర్థిక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయన్నారు. ఈ వ్యవహారంతో జనసేన సిటీ ఇన్‌ఛార్జి అనుశ్రీ సత్యనారాయణకు ఎలాంటి సంబంధంలేదని, ఇందులో ఆయన హస్తం లేదని స్పష్టం చేశారు. అధికారులకు థియేటర్లను తనిఖీలు చేసే అధికారం ఉంటుందని, లోపాలుంటే కేసులు రాస్తారని అన్నారు. ఛాంబర్ పెద్దలు త్వరలో విశాఖపట్నంలో ఒక జాయింట్ సమావేశం ఏర్పాటు చేస్తున్నారని, ఆ సమావేశంలో తీసుకునే నిర్ణయంపైనే భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని బాబు వెల్లడించారు. మీడియా సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు డి.శ్రీనివాస్, ఎం.సదాశివ, జి.రామారావు, జాస్తి బాపయ్య తదితరులు పాల్గొన్నారు.

థియేటర్లలో నిబంధనల ఉల్లంఘనలు: జేసీ

రాజమహేంద్రవరం, మే 28(ఆంధ్రజ్యోతి): సినిమా థియేటర్లలో నిబంధనల ఉల్లంఘనలను గుర్తించామని, ఆయా యాజమాన్యాలకు నోటీసులు జారీ చేస్తామని జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు పేర్కొన్నారు. సినిమా థియేటర్ల తనిఖీలు బుధవారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు థియేటర్లలో టికెట్లు, అల్పాహారం, కూల్‌డ్రింక్స్ ధరలు అధికంగా ఉన్నాయని, పారిశుధ్యం బాగోలేదన్నారు. యాజమాన్యాలు ధరల పట్టికలను కచ్చితంగా ప్రదర్శించాలన్నారు. ప్రభుత్వ నిర్దేశాలను అనుసరించి జిల్లాలో సినిమా థియేటర్లలో తనిఖీలు చేస్తున్నామన్నారు. రాజమండ్రి డివిజన్‌లో 25, కొవ్వూరు డివిజన్‌లో 15 థియేటర్లు ఉన్నాయన్నారు. ధరలపై నియంత్రణ ఉండాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి మాత్రమే టికెట్ల ధరల పెంపునకు అనుమతులిస్తామన్నారు. గీతా అప్సర, శ్యామల, స్వామి థియేటర్లలో తనిఖీలు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణ నాయక్, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రుక్కయ్య, అర్బన్ తహశీల్దారు పాపారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

ఒకటి నుంచి జేవీవీ సభ్యత్వ నమోదు

కాకినాడ సిటీ, మే 28 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల వివిధ స్థాయి బాధ్యులకు జన విజ్ఞాన వేదిక కాకినాడ జిల్లా అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్ అధ్యక్షతన బుధవారం కాకినాడ యూటీఎఫ్ హోంలో ప్రాంతీయ సదస్సు జరిగింది. ఉదయం సెషన్‌లో మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం 'చరిత్రలో సైన్స్' అంశంపై మాట్లాడుతూ ఏ సందర్భంలో సైన్స్ ఏ విధంగా వ్యవహరించిందో వివరించారు. మధ్యాహ్నం సెషన్‌లో మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ 'జేవీవీ నిర్మాణం-కొన్ని ప్రాధాన్యతలు' అంశంపై ప్రసంగించారు. జూన్ 1 నుంచి జేవీవీ సభ్యత్వ నమోదు ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా జరగనుందన్నారు.

గోదారిలో గల్లంతై.. మృతదేహాలుగా తేలి..


కేతా ప్రవీణ్ మృతదేహం


నీతిపూడి పాల్‌కుమార్ మృతదేహం


సూర్యతేజ మృతదేహం

- ముగ్గురు బాలురు మృతదేహాలు లభ్యం
- గంటల వ్యవధిలోనే వెలికితీసిన ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలు
- రాజోలు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం
- నాగుల్లంక గ్రామంలో విషాదఛాయలు

పి.గన్నవరం/ఆచంట, మే 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం నాగుల్లంక దిగువన ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా సరిహద్దు ప్రాంతం నాగుల్లంక దిగువన రావిలంకలో గోదావరిలో గల్లంతైన ముగ్గురు బాలురు మృతదేహాలుగా తేలారు. ఎస్డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టడంతో ప్రమాదానికి కొన్ని గంటల వ్యవధిలోనే వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. ప్రమాద ఘటనకు సమీపంలో కేతా ప్రవీణ్ (15), సానబోయిన సూర్యతేజ(12) మృతదేహాలు బుధవారం తెల్లవారుజామున లభ్యమయ్యాయి. నీతిపూడి పాల్‌కుమార్(15) మృతదేహం మాత్రం ప్రమాద స్థలికి సుమారు కిలో మీటరు దూరంలో లభ్యమైంది. మృతదేహాలను రాజోలు ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. స్థానిక ఎస్‌ఐ బి.శివకృష్ణ, తహశీల్దార్ పి.శ్రీపల్లవి సంఘటనా స్థలం వద్ద గాలింపు చర్యలను పరివేక్షణ చేయగా ఆచంట ఎస్‌ఐ కె. వెంకటరమణ మృతులు బంధువులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అలాగే గాలింపు చర్యల్లో ఎస్డీఆర్ఎఫ్ ఏసీ మోహనరావు, ఎస్‌ఐ రఘు, బృంద సభ్యులు పాల్గొన్నారు. బాలుర మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ నాగుల్లంకలోని మృతుల కుటుంబాలు వద్దకు వెళ్లి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మృతదేహాల వద్ద నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా మృతదేహాలను పరిశీలించి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఘటన తనను ఎంతో బాధించిందని, బాలుర కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


వశిష్టనదిపాయలో గాలింపు చర్యల్లో ఎస్డీఆర్‌ఎఫ్ బృందం


నాగుల్లంక ఏటిగట్టు వద్ద అంబులెన్స్‌లో మృతదేహాలను చూసి రోదిస్తున్న ప్రవీణ్ తల్లి, బంధువులు





చిన్నోడా లే...

చిన్నా...చిన్నా...చిన్నోడా లే అంటూ మృతదేహాన్ని కదుపుతూ తన కొడుకు కోసం ఓ అమ్మ పడిన రోదన..... ప్రవీణ్ మనల్ని వదిలిపెట్టి వెళ్లి పోతున్నాడే అంటూ పెద్దమ్మ ఆవేదన అక్కడి వారి గుండెలను పిండేసింది. గోదావరిలో గల్లం తైనవారిలో కేతా ప్రవీణ్, సూర్యతేజ మృతదేహాలను అంబులెన్స్‌లో రాజోలు తరలిస్తుండగా మార్గమధ్యంలో నాగుల్లంక ఏటిగట్టుపై మృతు డు తల్లికి, బంధువులు చూపించగా వారు బో రున విలపించారు. కాగా సూర్యతేజ, పాల్ కుమార్ వరసకు బావమరదులు కాగా ఇద్దరు తల్లులు ఉపాధి కోసం గల్ఫ్‌లోనే ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే ఇంటికి రావడానికి టిక్కెట్లు తీసుకున్నారని బంధువులు తెలిపారు.


సూర్యతేజను కడసారి చూసుకుంటున్న తండ్రి ఏడుకొండలు

ఒక్కరేసే సంతానం

ప్రమాద ఘటనలో రెండు కుటుంబాలకు ఒక్కొక్కరే సంతానం. మరొకరికి సోదరి మాత్రం ఉన్నారు. ఇచ్చిన ఒక్క సంతనాన్ని దేవుడు తన వద్దకు తీసుకుపోయాడంటూ ఆ కుటుంబాలు రోదించాయి. ఏడుకొండలు, దుర్గాభవాని దంపతులకు సూర్యతేజ ఒక్కడే సంతానం, వెంకటేశ్వరావు, సరోజని దంపతులకు ప్రవీణ్ ఒక్కడే సంతానం. మూడేళ్ల క్రితం తండ్రిని కోల్పోయిన పాల్‌కుమార్‌కు సోదరి ఉంది. ఈ ప్రమాద ఘటనతో నాగుల్లంక గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సలాదివారిపాలెం ఘటనలో...
క్రాంతి కిరణ్ మృతదేహం లభ్యం


క్రాంతి కిరణ్ మృతదేహం


ఫైల్‌ఫొటో

ముమ్మిడివరం, మే 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ పరిధి సలాదివారిపాలెంలో గౌతమీ గోదావరి నదీ పాయలో స్నానానికి దిగి గల్లంతైన సబ్బిత క్రాంతి కిరణ్ (19) మృతదేహం బుధవారం వైఎస్సార్ వారధి సమీపంలో లభ్యమైంది. కె.గంగవరం మండలం శేరిలంకలో సోమవారం జరిగిన ఒక శుభ కార్యక్రమానికి విచ్చేసిన పలువురిలో 11 మంది గోదావరి నదీ పాయలో స్నానానికి వెళ్లగా వారిలో ఎనిమిది మంది గల్లంతైన విషయం విదితమే. ఏడు మృతదేహాలను మంగళవారం సాయంత్రానికి రెస్క్యూ ఆపరేషన్ బృందం బయటకు తీయగా బుధవారం ఉదయం క్రాంతి కిరణ్ మృతదేహం వైఎస్సార్ వారధి సమీపంలో లభ్యమైంది. పోలీసు, ఎస్డీఆర్ఎఫ్ బృందం బయటకుతీసి పోస్టుమార్టం నిమిత్తం ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించి అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో సెర్చింగ్ ఆపరేషన్‌ను పోలీస్‌లు,అధికారులు ముగించారు.

కాకినాడలో క్రాంతి, అభిషేక్ అంత్యక్రియలు


క్రాంతి కిరణ్, పాల్ అభిషేక్ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించిన దృశ్యం

కాకినాడ, మే 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ పరిధి సలాదివారిపాలెంలో గోదావరి నదిలో స్నానానికి వెళ్లి విగతజీవులుగా మారిన కాకినాడ జగన్నాథపురం గోళీలపేటకు చెందిన సబ్బిత క్రాంతి కిరణ్ (19), సబ్బిత పాల్ అభిషేక్ (18) మృతదేహాలను బుధవారం మధ్యాహ్నం కాకినాడకు తీసుకొచ్చారు. బంధువులు, మిత్రులు, సంఘీయులు, స్థానికుల సందర్శనార్థం కొద్దిసేపు ఉంచి అక్కడి నుంచి భారీ ఊరేగింపు మధ్య జగన్నాథపురంలోని ఏపీటీ సమీపంలో ఉన్న క్రైస్తవ స్మశాన వాటికకు తీసుకెళ్లారు. అక్కడ క్రైస్తవ సంప్రదాయ పద్ధతిలో ఖననం చేశారు. అందరితో కలివిడిగా ఉండే క్రాంతి, పాల్ మరణాన్ని స్థానికులతో పాటు బంధువులు, మిత్రులు, సన్నిహితులు జీర్ణించుకోలేకపోయారు. వారి స్నేహితులు, క్లాస్‌మేట్స్ పెద్ద ఎత్తున తరలివచ్చారు. విగతజీవులుగా ఉన్న తమ స్నేహితులను చూసి కన్నీటిపర్యంతమయ్యారు.

వ్యాపారికి అకౌంటెంట్ నమ్మక ద్రోహం

రూ.12లక్షల విలువైన ఆభరణాలు, నగదుతో ఉడాయింపు

కేసు నమోదు చేసిన పోలీసులు

అమలాపురం టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ప్రముఖ వ్యాపారి వద్ద ఐదేళ్లుగా నమ్మకంగా పనిచేస్తున్న వ్యక్తి రూ.12లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, నగదుతో ఉడాయించాడు. వెంటనే తేరుకున్న యజమాని అమలాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లా అమలాపురం పట్టణానికి చెందిన జీకే రెస్టారెంట్ యజమాని గంగుమళ్ల షణ్ముకేశ్వరరావు అలియాస్ కాసుబాబు వద్ద అయినవిల్లి మండలం క్రాప గ్రామానికి చెందిన కంతేటి రాజు గత ఐదేళ్లుగా అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. ముమ్మిడివరంలోని సీఎస్ బ్యాంకులో కాసుబాబు బంగారు ఆభరణాలను కుదవ పెట్టుకున్నాడు. వాటిని విడిపించుకురమ్మని అక్కౌంటెంట్ రాజుకు నగదు ఇచ్చి ఈ నెల 26న పంపించాడు. బ్యాంకులో ఆభరణాలను విడిపించుకుని రూ.2.25లక్షల మిగులు నగదుతో వెనుదిరిగాడు. ఆ తరువాత రూ.9.66 లక్షల విలువైన 322 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2.25లక్షల నగదుతో ఉడాయించాడు. విషయం తెలుసుకున్న యజమాని కాసుబాబు ఈ నెల 27వ తేదీ రాత్రి అమలాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాసుబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

దైవ దర్శనానికొచ్చి.. కొలనులో కన్నుమూసి


మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న పోలీసులు


మరణించిన చరణ్

అన్నవరంలో యువకుడి మృతి

అన్నవరం, మే 28 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి చక్రస్నానం నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన కొలనులో పడి యువకుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం జగపతినగరానికి చెందిన వాసంశెట్టి వెంకటరమణ తన కుటుంబసభ్యులు 15మందితో బుధవారం అన్నవరం సత్యదేవుడి దర్శనానికి వచ్చారు. ముందు పంపా రిజర్వాయిర్‌కు చేరుకున్న వారిలో ముగ్గురు యువకులు స్నానానికి దిగారు. వీరిలో వాసంశెట్టి చరణ్ తేజ (16) కాలు జారి ఇటీవల సత్యదేవుడి కల్యాణోత్సవాల్లో చక్రస్నానం కోసం ఏర్పాటుచేసిన కొలనులో జారి పడి ఈత రాకపోవడంతో ఊపిరాడక మృతిచెందాడని అన్నవరం ఎస్‌ఐ హరిబాబు తెలిపారు. మృతదేహాన్ని ప్రత్తిపాడు ఆసుపత్రికి త రలించి కేసు నమోదు చేశామన్నారు. ఘటనా స్థలాన్ని దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు పరిశీలించారు.

స్వగ్రామానికి బద్దే రాజేంద్రప్రసాద్ మృతదేహం



వీరన్నమెరకకు చేరిన రాజేంద్రప్రసాద్ మృతదేహం

అమలాపురం, మే 28(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అల్లవరం మండలం వీరన్నమెరకకు చెందిన బద్దే రాజేంద్రప్రసాద్ మృతదేహాన్ని బుధవారం స్వచ్ఛంద సంస్థల సహకారంతో స్వగ్రామానికి తీసుకువచ్చారు. ఒమన్‌లో ఉంటున్న తన భర్త రాజేంద్రప్రసాద్ చనిపోయాడని అంటున్నారని, పూర్తి వివరాలు తెలియడం లేదని కలెక్టరేట్‌లో కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌కు భార్య బద్దే సుధ ఇటీవల వివరించింది. దాంతో సెంటర్ అధికారులు ఏపీ ఎన్నార్టీ ద్వారా భారత రాయబారి కార్యాలయాన్ని సంప్రదించారు. పూర్తిగా విచారించిన అనంతరం భారత రాయబారి కార్యాలయం రాజేంద్రప్రసాద్(పాస్‌పోర్టు నంబరు వి9142120) మరణాన్ని ధ్రువీకరించారు. ఒమన్ రాజ్యంలోని సూర్ పట్టణంలో నసీర్, అబ్దుల్లా, సయ్యద్, ఖమిస్, అల్‌అలైమి స్పాన్సర్‌షిప్‌లో రాజేంద్రప్రసాద్ ఉండేవాడని, ఈ నెల 20న చేసుకున్నట్టు వివరించారు. రాజేంద్రప్రసాద్ మృతదేహాన్ని దేశానికి తరలించేందుకు స్వచ్ఛంద సంస్థలు సహకారం అందించాయి. దాంతో బుధవారం కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ ప్రతినిధులు రాజేంద్రప్రసాద్ మృతదేహాన్ని స్వగ్రామానికి చేర్చారు.

లారీ ఢీకొన్న ఘటనలో చిరతపూడి వాసి మృతి


ముసలయ్య (ఫైల్)

అంబాజీపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్లి తిరిగొస్తుండగా లారీ ఢీకొన్న సంఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న చిరతపూడి వాసి మామిడిశెట్టి వెంకటపతి (ముసలయ్య)(58) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఈనెల 21న భద్రాచలం స్వామివారి దర్శనం చేసుకున్న కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం చిరతపూడి వస్తున్న సమయంలో కొత్తగూడెం వద్ద బొగ్గులారీ కారును ఢీకొనడంతో కనకదుర్గ, వెంకటరత్నం మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో తీవ్రగాయలైన ముసలయ్య, కోడలు జ్యోతిస్వరూప, మనవలు దీక్షిత, చేతన్లు చికిత్స పొందుతున్నారు. విజయవాడ మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముసలయ్య బుధవారం మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇప్పటికే ముసలయ్య భార్య కనకదుర్గ, కుమారుడు వెంకటరత్నం మృతితో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ముసలయ్య మృతితో ఆ ప్రాంతం శోకసంద్రంలో మునిగిపోయింది.

కూనవరం మండలంలో గాలివాన బీభత్సం

నాలుగు పశువుల మృతి

కూనవరం, మే 28 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కూనవరం మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కుంభవృష్టి కురవటంతో ప్రజలు భయాందోళన చెందారు. 3 గంటలు ఏకధాటిగా వర్షం కురిసింది. 49.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉరుములు, మెరుపుల కారణంగా ఇళ్లల్లోని విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. కొంతమంది ఇళ్లల్లో ఫ్యాన్లు, విద్యుత్ మీటర్లు, ఇన్వెటర్లు కాలిపోయాయి. మండలంలోని టేకుబాక గ్రామంలో గాలివాన కారణంగా విద్యుత్ వైర్లు పడిపోవడంతో 4 పశువులు మరణించాయి.


టేకుబాక గ్రామంలో మరణించిన పశువులు

వ్యాన్‌పై నుంచి జారిపడి ఇద్దరు గిరిజనులకు తీవ్రగాయాలు

వై.రామవరం, మే 28(ఆంధ్రజ్యోతి): ఓ శుభకార్యానికి వెళ్లి వస్తూ వ్యాన్‌పై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఇద్దరు గిరిజనులు తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. వివరాల్లోకి వెళ్తే.. అల్లూరి జిల్లా వై.రామవరం మండలం పి.ఎర్రగొండకు చెందిన కెచ్చల రామకృష్ణారెడ్డి, పల్లాల శ్రీనివాసరెడ్డిలు మరికొంతమందితో చామగడ్డ పంచాయితీ సింగవరంలో జరిగిన రజస్వల ఫంక్షన్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బొలెరో వ్యానులో వస్తుండగా వేగంగా నడపడంతో కుదుపులకు రాచపాలెం- పనసలపాలెం మధ్య ఇద్దరు జారి కింద పడిపోగా తలలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరిని వై.రామవరం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేసినట్టు ఆసుపత్రి సూపరింటిండెంట్ రాహుల్,డాక్టర్ జీవన్ పేర్కొన్నారు.


తీవ్రంగా గాయపడిన రామకృష్ణారెడ్డి

వంటింట్లోకి దూరి.. అర్ధరాత్రి బంగారం కాజేసి..


చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న తిమ్మాపురం పోలీసులు

ఇంట్లో కుటుంబం నిద్రిస్తుండగా చోరీ

కాకినాడ జిల్లా తిమ్మాపురంలో ఘటన

సర్పవరం జంక్షన్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో కుటుంబ సభ్యులంతా నిద్రపోతున్నారు. వంట గది కిటికీలోంచి తలుపునకు వేసిన గడియ తీసి ఇంట్లోకి ప్రవేశించి బీరువా తాళం తీసి దర్జాగా రూ.3 లక్షలు విలువైన బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకుపోయిన సంఘటన తిమ్మాపురంలో జరిగింది. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం పంచాయతీ సమీపంలోని రామకృష్ణనగర్‌లో కాంట్రాక్టర్ ముదునూరి సుబ్బరాజు నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి భార్యభర్తలు ఒక గదిలో, కుమార్తె మరో గదిలో నిద్రించారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో కుక్కలు అరిచిన శబ్దానికి కుమార్తె లేచి చూడగా ఎవరో పారిపోతున్నట్టు గుర్తించి తల్లిదండ్రులను నిద్ర లేపింది. వారు నిద్రలేచి చూడగా బీరువా తలుపు తెరిచి ఉన్నాయి. కంగారుగా వస్తువులను పరిశీలించగా చోరీకి గురైనట్టు గుర్తించి తిమ్మాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదనపు ఎస్‌ఐ ఆర్‌వీఎస్ మూర్తి సిబ్బందితో కలిసి చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. నిందితులు వంట గది పక్కన ఉన్న కిటికీలో నుంచి గడియ వేసేందుకు వినియోగించిన చిలుకను చాకచక్యంగా తీసి ఇంట్లోకి ప్రవేశించారు. అక్కడ గదిలో ఉన్న బీరువా తాళాలతో బీరువా లాకర్‌లో ఉంచిన సుమారు రూ.3 లక్షలు విలువైన బంగారు ఆభరణాలను తీసుకుని పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జి సీఐ బి.పెద్దిరాజు ఆదేశాలతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ మూర్తి తెలిపారు. చోరీ జరిగిన తీరును పరిశీలించి నిందితుల ఆచూకీ కోసం క్లూస్ టీమ్, పోలీసు జాగిలాలను రప్పించారు. వంట గదికి తాళం వేయకుండా గడియ పెట్టడంతో నిందితుడు కిటికీలో నుంచి సులువుగా గడియతీసి చోరీకి పాల్పడినట్టు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఇంట్లో నిద్రలో ఉండగా భార్యభర్తలపై మత్తు మందు చల్లి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

తిరుపతి వెళ్తే ఇల్లు దోపిడీ

రఘునాథపురంలో

బంగారం, వెండి ఆభరణాల అపహరణ

రాజానగరం, మే 28(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రఘునాథపురంలోని ఓ ఇంట్లో దొంగలు ప్రవేశించి విలువైన బంగారు ఆభరణాలు, వెండి సామగ్రిని అపహరించారు. గ్రామానికి చెందిన బల్లి వెంకటేశులు ఈనెల 25న బంధువులతో కలిసి తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లారు. ఈ నేపథ్యంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులతో పాటు నగదును దోచుకున్నారు. 26న ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన ఎదురింటి వాళ్లు వెంకటేశులుకు ఫోన్‌లో సమాచారం అందించారు. ఇంటికి వచ్చి చూసేసరికి బీరువాలో భద్రపర్చిన బంగారు లాకెట్, హారం, ఉంగరాలు, వెండి కంచం, చెంబు, కుందులతో పాటు కొంత నగదు అపహరణకు గురైనట్టు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మొత్తం 64 గ్రాముల బంగారం, 850 గ్రాముల వెండి అపహరించినట్టు నిర్ధారించారు. వీటి విలువ రూ.1.77 లక్షలు ఉంటుందని అంచనా వేసినట్టు ఎస్‌ఐ నాగార్జున తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

రేపు రత్నగిరిపై యోగాంధ్ర

తెలుపురంగు వస్త్రాలు ధరించి

హాజరుకావాలి : ఈవో

అన్నవరం, మే 28 (ఆంధ్రజ్యోతి): 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని పర్యాటకశాఖ ఆధ్వర్యంలో యోగాంధ్రలో భాగంగా కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో శుక్రవారం భారీస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి ఏర్పాట్లను బుధవారం ఈవో సుబ్బారావు, పీఆర్వో కృష్ణారావు పరిశీలించారు. శుక్రవారం గ్రామస్థులు, అన్నవరం దేవస్థానంలో పనిచేస్తున్న పురోహితులు, నాయీబ్రాహ్మణులు, ఇతర ఉద్యోగులందరూ ఆలయ ప్రాంగణంలో వార్షిక కల్యాణవేదిక వద్దకు ఉదయం 7 నుంచి 9వరకు జరిగే యోగా కార్యక్రమాలకు తెలుపురంగు వస్త్రాలు ధరించి హాజరుకావాలని ఈవో కోరారు.

ప్రసాదం కౌంటర్లో మద్యం తాగి ఉద్యోగి విధులు

చర్యలకు ఆదేశించిన అధికారులు

అన్నవరం దేవస్థానం కొండ దిగువన ప్రసాదం కౌంటర్లో ఒక ఉద్యోగి మద్యం తాగి విధులు నిర్వహించడంతో అతడిపై చర్యలకు అధికారులకు ఆదేశించారు. వివరాల్లోకి వెళితే సన్నిధి విభాగానికి చెందిన ఈశ్వరసాయి పృథ్వీతేజ బుధవారం టిక్కెట్ కౌంటర్లో విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ప్రసాదం కొనుగోలు కోసం విచ్చేసిన భక్తుడితో వాగ్వాదానికి దిగడంతో అధికారులకు పిర్యాదు చేశాడు. దీంతో అతడికి బ్రీత్‌ఎనలైజర్ పరీక్షలు నిర్వహించి మద్యం తాగినట్టు గుర్తించి విధుల నుంచి ఇంటికి పంపించారు. దీనిపై నివేదిక ఇచ్చినట్టు సన్నిధి విభాగ సూపరింటిండెంట్ యనమల అప్పారావు తెలిపారు.

మహిళ మెడలో గోల్డ్‌చైన్ లాక్కుని పరారీ

పిఠాపురం, మే 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో మహిళ మెడలో బంగారు చైన్ లాక్కుని దుండగులు పరారయ్యారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్సు సమీపంలో నివాసముంటున్న యాళ్ల సుజాత మంగళవారం రాత్రి జగ్గంపేట చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొని తిరిగి ఇంటికి వస్తోంది. ఆ సమయంలో కారులో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు తన మెడలో ఉన్న నాలుగు కాసుల బంగారు చైన్‌ను లాక్కుని పరారైనట్టు సుజాత పిఠాపురం పట్టణ పోలీసులకు పిర్యాదు చేసింది. దీంతో పోలీసులు సమీపంలోని సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

గంజాయితో ఏడుగురి అరెస్ట్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న రావులపాలెం పోలీసులు

రావులపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి): గంజాయితో ఏడుగురిని అరెస్ట్ చేసినట్టు రావులపాలెం పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఊబలంక ఏటిగట్టు పక్కన రావిచెట్టు వద్ద అనుమానస్పందంగా ఏడుగురు వ్యక్తులు సంచరిస్తున్నట్టు సమాచారం వచ్చింది. దీంతో డీఎస్పీ సుంకర మురళీమోహన్ పర్యవేక్షణలో సీఐ ఎం.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో ఎస్‌ఐ నాయుడు రాము సిబ్బందితో అక్కడికి వెళ్లి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు.ఊబలంకకు చెందిన సత్తి భాస్కరవీరరెడ్డి, పసంగి సింహాద్రి, రావులపాలానికి చెందిన శిరిగినీడి పవన్, సత్తి వీర సత్యసాగర్ రెడ్డి, ఆత్రేయపురం మండలం మెర్లపాలానికి చెందిన వాసంశెట్టి చంద్రమౌళి, రావులపాలానికి చెందిన మల్లిడి కిరణ్‌రెడ్డి, ఆత్రేయపురం మండలం ర్యాలికి చెందిన మామిడిపల్లి నాగరాజులను అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయి తాగడంతో పాటు అమ్మకానికి ప్రయత్నిస్తున్నట్టు తెలిసిందన్నారు. దీంతో రూ.5వేలు విలువైన 500 గ్రాముల గంజాయిని వారి నుంచి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

చింతూరులో ఇద్దరు...


చింతూరు బస్‌స్టేషన్ వద్ద పట్టుబడ్డ నిందితులు

చింతూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): చింతూరు పోలీసులు బుధవారం గంజాయితో ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ రమేష్ కథనం మేరకు.. వాహన తనిఖీలు చేస్తుండగా బస్ స్టేషన్ వద్ద ఇద్దరు అనుమానాస్పదంగా కన్పించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా వారి వద్ద 30కిలోల గంజాయి పట్టుబడింది. చిత్తూరు జిల్లాకు చెందిన గుండ్లఘటం రవిచంద్రన్ విజయ్, కండిగ రాజశేఖర్ ఒడిస్సాలో గంజాయి కొనుగోలు చేసి వయా చింతూరు మీదుగా తమిళనాడుకు గంజాయి తరలించే క్రమంలో పట్టుబడినట్టు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1,50,000 ఉంటుందన్నారు. తహశీల్దార్ చిరంజీవి, వీఆర్వోలు సోడె సుబ్బారావు, సుజాత సిబ్బంది పాల్గొన్నారు.

'లోవ' హుండీల లెక్కింపులో అటెండర్ చేతివాటం

- రూ.500 నోట్ల కట్ట చోరీ
- సస్పెండ్ చేసిన అధికారులు


సస్పెండ్ అయిన అటెండర్ రమణ

తుని రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానంలో బుధవారం జరిగిన హుండీల ఆదాయం లెక్కింపులో దేవస్థానం అటెండర్ ఎల్ఎస్‌వీ రమణ చేతివాటం చూపించాడు. 109 నోట్లు ఉన్న రూ.500 నోట్ల కట్టను దొంగిలించినట్టు సమాచారం అందడంతో ఆలయ అధికారులు సీసీ కెమెరాలను పరిశీలించారు. దీంతో హుండీ డబ్బులు చోరీ చేసినట్టు రుజువు కావడంతో అటెండర్‌ను విధుల నుంచి తొలగించారు. అతడిపై రూరల్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేయనున్నట్టు ఈవో తెలిపారు. అయితే హుండీల లెక్కింపు జరిగే ప్రాంతంలో సంబంధిత ఉద్యోగి తప్పించుకునే ప్రయత్నంలో కింద పడినట్టు తెలిసింది. దీంతో స్వల్ప గాయాలు కాగా ఆలయ అధికారులు ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు సమాచారం. లెక్కింపులో వివిధ విభాగాల ద్వారా రూ.42,28,836 ఆదాయం సమకూరినట్టు ఉప కమిషనర్, లోవ కార్యనిర్వహణాధికారి టి.విశ్వనాధరాజు పేర్కొన్నారు.



నన్నయ వర్సిటీలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ తదితరులు



కడియంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

దార్శనికుడు ఎన్టీఆర్

- నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ
- టీడీపీ వ్యవస్థాపకుడి జయంతి
- ఘనంగా నివాళులర్పించిన పార్టీ నాయకులు, పలువురు అధికారులు

దివాన్‌చెరువు, మే 28(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో విశ్వవిద్యాలయాలు స్థాపించి విద్యాభివృద్ధికి కృషిచేసిన దార్శనికుడు ఎన్టీఆర్ అని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు(ఎన్టీఆర్) 102వ జయంతి కార్యక్రమాన్ని పలుచోట్ల బుధవారం నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నన్నయ వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ చిత్రపటానికి వీసీ ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ ఎన్టీఆర్ విజన్‌ను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మహిళలకు విద్య అందని ద్రాక్షగా ఉన్న సమయంలో శ్రీపద్మావతి మహిళావిశ్వవిద్యాలయాన్ని ఎన్టీఆర్ స్థాపించి మహిళా విద్య, ఉన్నతికి కృషి చేశారన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం స్థాపించి తెలుగుభాష సాహిత్యం, సంస్కృతి, అభివృద్ధికి దోహదపడ్డారని ప్రశంసించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రాజానగరం: తెలుగు జాతి కీర్తి, ప్రతిష్ఠలను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు అన్నారు. రాజానగరం, సూర్యారావుపేటలో ఎన్టీఆర్ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగు ప్రజల గుండెల్లో చిర స్థాయిగా నిలిచిపోయారన్నారు. అనతి కాలంలో పార్టీని స్థాపించి అధికారంలోకి వచ్చిన ఏకైక పార్టీ టీడీపీ అని అన్నారు. పేదలకు కిలో బియ్యం రూ.2కు పథకంతోపాటు వృద్ధులకు పెన్షన్ సౌకర్యం ప్రవేశపెట్టిన మహోన్నతుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. అలాగే మండలంలోని చక్రద్వారబంధం, రాధేయపాలెం, కలవచర్ల, పల్లకడియం, మల్లంపూడి, నరేంద్రపురం, సీతారాంపురం, ఫరిజల్లిపేట, వెలుగుబంద గ్రామాల్లో ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నీలపాల అరవరాజు, బత్తుల త్రిమూర్తులు, బచ్చు ప్రసాద్, వంక మల్లిబాబు, మద్దిరెడ్డి చినవెంకటేశ్వరరావు, పెద్దిశెట్టి నారాయణస్వామి, దాసరి శ్రీను, పాతూరి నవీన్ చౌదరి, కుర్రే నాగబాబు పాల్గొన్నారు.

ధవళేశ్వరం: స్థానిక పంచాయతీ ఆవరణలో కార్యదర్శి జి.వెంకట్రావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. స్థానిక కొత్తపేట వద్ద ప్రధాన రహదారి, కుమ్మరి వీధి, జడ్పీ బాలికోన్నత పాఠశాల వద్ద ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో పంచాయతీ సిబ్బందితో పాటు టీడీపీ నాయకులు పిన్నంటి ఏకబాబు, ఆళ్ల ఆనందరావు, బత్తిన బ్రదర్స్, పళ్ల రామస్వామి, పుక్కెళ్ల రాజు, కొత్తూరి దుర్గారావు, పురాణం శ్రీనివాస్, నాళ్ల రమేష్, అడపా శ్రీను, నందిగం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కడియం: తెలుగువారి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి నాని, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు మార్గాని సత్యనారాయణ అన్నారు. కడియం, మురమండ, బుర్రిలంక, వేమగిరి, దుళ్ల గ్రామాల్లో ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమాల్లో పాటంశెట్టి సూర్యచంద్రరావు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు బోడపాటి గోపి, ప్రత్తిపాటి రామారావుచౌదరి, వరగోగుల సత్యనారాయణ, వరగోగుల వెంకటేశ్వరరావు, బొర్సు వెంకటేశ్వరరావు, సత్తి గిరి, దొంతంశెట్టి శ్రీను, కనికెళ్ళ బుల్లియ్య, గోరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరంలోని కోటిపల్లి బ స్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ సానబోయిన రామారావు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ శాతాన్ని పెంచిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. పటేల్ పట్వారి వ్యవస్థను రద్దు చేసి స్థానిక సంస్థల ప్రాధాన్యతను పెంచి అందులో బీసీలకు రిజర్వేషన్ శాతాన్ని పెంచారన్నారు. దాని వల్ల చాలా మంది బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ పదవుల్లో న్యాయం జరిగిందన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్ శాతాన్ని పెంచి న్యాయం చేయడమే ఎన్టీఆర్‌కు కూటమి ప్రభుత్వం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యు.గంగాధర్, మట్టపర్తి సత్యనారాయణ, గొర్సా తాతబ్బాయి యాదవ్, పోలవరపు రాము, ప్రతీప్, పలివెల సత్యనారాయణ పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ ఆదేశాలతో పార్టీ సీనియర్ నాయకుడు నిమ్మలపూడి గోవింద్, అన్నె రామకృష్ణ, మళ్ల వెంకట్రాజు, ఎం.శ్రీనివాస్, అన్నెం ప్రణవ్ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. నగరంలోని అన్న క్యాంటీన్‌లోను, శ్రీరామ్‌నగర్‌లోను అన్నదానం చేశారు. అలాగే గోదావరి బండ్ రోడ్డు కుమారి టాకీస్ సమీపంలో ఎన్టీఆర్ విగ్రహానికి నిమ్మలపూడి గోవింద్, నందమూరి వంశాభిమానుల సంఘం అధ్యక్షుడు గొర్రెల రమణ, నల్లం శ్రీను, పులి శ్రీనివాసరెడ్డి నివాళులర్పించారు. పేదలకు చీరలు పంచారు.

రాజమహేంద్రవరం అర్బన్: కొందరు మనుషులు మాత్రమే చరిత్ర పుటల్లో, ప్రజల గుండెల్లో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకుంటారని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డీవీ రమణమూర్తి అన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రిగా ఉన్నత విద్యకు ఎన్టీఆర్ అందించిన ప్రోత్సాహం మరచిపోలేమన్నారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల సూపరింటెండెంట్ బీహెచ్ వీవీఎస్ మూర్తి, తెలుగుశాఖాధిపతి పీవీబీ సంజీవరావు, జి.శరత్‌బాబు, జే.పద్మజ, సీహెచ్ కుసుమ, కె.సత్యనారాయణ, సీహెచ్ తులసీరావు మాట్లాడారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



బిక్కవోలులో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక గౌతమీ గ్రంథాలయంలో లైబ్రరియన్ శ్రీదేవి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. గ్రంథాలయ సిబ్బంది,వేసవి శిక్షణా శిబిరానికి హాజరైన విద్యార్థులు,పాఠకులు పాల్గొన్నారు.

రంగంపేట: మండలంలోని వడిశలేరులో ఎన్టీఆర్ విగ్రహానికి కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోతుల వెంకట్రాజు మాట్లాడుతూ ఎన్టీఆర్ సినీ నటుడిగా ఉన్నప్పుడు ప్రజల కష్టాల్లో ఉంటే జోలె పట్టి ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఉప్పలపాటి బుల్లిదొర, చావ శ్రీనివాస్, మలిరెడ్డి శ్రీనివాస్, అక్కిన నాగేశ్వరరావు పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సాయిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ చిత్ర పటానికి నివాళులర్పించారు. రాష్ట్రంలో ఏటా మే 28న ఎన్టీఆర్ జయంతిని రాష్ట్ర వేడుకగా నిర్వహించుకోవాలని పేర్కొంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి నీలపాల త్రిమూర్తులు, జడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, బీజేపీ మండలాధ్యక్షుడు ఎం.సాయిరామ్, గారపాటి రాంబాబు, ఉండవిల్లి గిరిబాబు, బలిరెడ్డి దుర్గారావు పాల్గొన్నారు.

అనపర్తి: మండలంలోని రామవరం, పొలమూరు గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అనపర్తి ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు ఆద్యుడిగా ఎన్టీఆర్ చేపట్టిన అనేక కార్యక్రమా లు ఆయనను పేదల గుండెల్లో దైవంగా నిలిచేలా చేశాయన్నారు. అనపర్తి సావరంలో ఎన్డీయే కార్యకర్తల ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పించి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, గొలుగూరి భాస్కరరెడ్డి, కర్రి వెంకటరెడ్డి, ఒంటిమి సూర్య ప్రకాష్, నూతిక బాబూరావు, తేనెల శ్రీని వాస్, చింతా సురేష్‌రెడ్డి, ద్వారంపూడి ఈశ్వరరెడ్డి, కర్రి శేషారత్నం, మల్లిడి ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలు వంతెన వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ నాయకుడు జంపా వెంకటరమణతో కలిసి కేకు కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లి వాసు, పాలచర్ల చిట్టిబాబుచౌదరి, బేరా వేణమ్మ, చాగంటి సాయిబాబారెడ్డి, గొర్రెల త్రిమూర్తులు, వైదాడి వెంకటేశ్వరరావు, సింగారపు రామారావు పాల్గొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ తేతలి సుమ, ఎంపీడీవో వి.శ్రీనివాస్, డీఎంపీడీవో జాన్‌మిల్టన్, సిబ్బంది, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సత్యకృష్ణ, ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు.

కోరుకొండ: కోరుకొండ ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ సర్పంచ్ ఇసుకపల్లి రాజారావు, దాశెట్టి శ్రీను, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సూరంపూడి సూరిబాబు, ఉప్పలపాటి వీరాస్వామి, ఉప్పలపాటి అబ్బులు, పసుపులేని శ్రీను, మాతా సీతారాముడు, సుంకర శ్రీనివాస్, ఎం.హరిబాబు, బి.భూపతిరావు తదితరులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవాలి

కానవరంలో డ్వాక్రా సంఘాల మహిళలతో కలెక్టర్ ప్రశాంతి



కానవరంలో డ్వాక్రా మహిళలకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజానగరం, మే 28 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాక సంఘాల్లోని మహిళలు తమ జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి చెప్పారు. మండలంలోని కానవరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ-సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల జీవనోపాధుల అభివృద్ధిలో భాగంగా వార్షిక రుణ జీవనోపాధుల ప్రణాళికను (ఏసీఐపీ)తయారు చేసుకునే విధానాన్ని బుధవారం సాయంత్రం కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యుల ఆర్థిక పురోభివృద్ధికి పలు సలహాలు, సూచనలు అందించారు. అందుబాటులో ఉన్న వనరులు, ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకుంటూ ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నారు. బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి, సామాజిక పెట్టుబడి(సీఐఎఫ్) రుణాలను విరివిగా పొందేందుకు ఇటువంటి ముందస్తు వార్షిక రుణ ప్రణాళికలు దోహదపడతాయన్నారు. సంఘ సభ్యులు మాట్లాడుతూ ముందస్తు కార్యాచరణ వల్ల ఎంతో మేలు చేకూరుతుందన్నారు. సంఘాల్లోని సభ్యులకు ఎవరికి ఎప్పుడు రుణం అవసరం, ఎంత అవసరమో ముందస్తు ప్రణాళిక ద్వారా సాధ్యపడుతుందంటూ ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ఎన్ మూర్తి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు ఎ.శ్రీనివాసరావు, ఇ.శ్రీనివాసబాబు, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ జి.సునీత, క్లస్టర్ కోఆర్డినేటర్‌లు పాల్గొన్నారు.

మహనీయుడు ఎన్టీఆర్ : ఎస్పీ కిశోర్

రాజమహేంద్రవరం, మే 28(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు నందమూరి తారక రామారావు అని ఎస్పీ నరసింహ కిశోర్ కొనియాడారు. ఎన్టీఆర్ 102వ జయంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్టీఆర్ యుగపురుషుడని, ప్రపంచ స్థాయిలో తెలుగు వారికి గుర్తింపు తీసుకొచ్చారని, తెలుగు వారికి ఆయన ఆరాధ్య దైవమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, ఎల్.అర్జున్, ఎల్.చెంచిరెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్ట్స్ డిగ్రీ ఫైనలియర్ ఫలితాలు విడుదల

రాజమహేంద్రవరం అర్బన్, మే 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల డిగ్రీ ఫైనలియర్, సెకండియర్ ఫలితాలను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే విడుదల చేశారు. ఫైనలియర్ (ఆరో సెమిస్టర్) బీఏలో 91.30 శాతం, బీకాంలో 94.03 శాతం, బీబీఏలో 97.92 శాతం, బీఎస్సీలో 87.50 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అలాగే సెకండియర్ (నాలుగో సెమిస్టర్)లో బీఏలో 74.1 శాతం, బీకాంలో 81.36 శాతం, బీబీఏలో 81.65 శాతం, బీఎస్సీలో 80.44 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ పి.బాబ్జీ, అకడమిక్ కో ఆర్డినేటర్ ఏ.రాజేశ్వరి, ఐక్యూఏసీ ఏఏ అన్నపూర్ణ, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే ఊరుకోం

ఇసుక ర్యాంపుల యాజమాన్యాలతో ఎమ్మెల్యే బత్తుల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

సీతానగరం, మే 28(ఆంధ్రజ్యోతి): ఇసుక రవాణా వల్ల ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే ఊరుకోబోమని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఇసుక ర్యాంపు యజమానులకు వార్నింగ్ ఇచ్చారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఇసుక ర్యాంపు యాజమాన్యాలతో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక రవాణా చేసుకోవాలన్నారు. లారీల్లో ఓవర్ లోడింగ్, టార్పాలిన్ లేకుండా ఇసుక రవాణా, వాహనాలు అధిక వేగంతో వెళ్లడం చేయరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేస్తామని, అదే తప్పు పదే పదే జరిగితే ఇసుక ర్యాంపు అనుమతులు రద్దు చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలకు కష్టం కలగకుండా చూడాలని ఎస్ఐ రామకుమార్‌ను, తహశీల్దార్ శ్రీనివాస్‌లను ఆదేశించారు. ఇసుక ర్యాంపుల నిర్వహణను జనసేన నాయకులు కార్యకర్తలు పర్యవేక్షిస్తుంటారన్నారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలపై రోగులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

అమరావతిలో నర్సరీ రంగ అభివృద్ధికి సహకరించాలి

మంత్రి దుర్గేష్‌కు నర్సరీ సంఘం వినతి

కడియం, మే 28(ఆంధ్రజ్యోతి): కడియం నర్సరీరంగం అభివృద్ధికి తోడ్పాటునిస్తూ రాజధాని అమరావతిలో బొటానికల్ గార్డెన్, ఎకో టూరిజం, ప్లాంట్ బయోడైవర్సిటీ కేంద్రం ఏర్పాటుకు పదెకరాల భూమిని కేటాయించాలని మంత్రి కందుల దుర్గేష్‌ను నర్సరీసంఘం కోరింది. ఈ మేరకు బుధవారం నర్సరీ సంఘం అధ్యక్షులడు రత్నం అయ్యప్ప, కార్యవర్గ సభ్యులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. అమరావతిలో థాయిలాండ్ తరహాలో చాటుచుక్ వంటి మార్కెట్‌ను ఏర్పాటు చేయాలనుకుంటున్నామన్నారు. మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణతో పాటు చిన్న, సన్నకారు నర్సరీరైతులు అభివృద్ధి చెందుతారన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఈ విషయాన్ని మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి నర్సరీ రైతులకు మేలు జరిగే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో కొండేపూడి నాగు, తాడాల నాగేశ్వరరావు, గాజుల రత్తయ్య, రత్నం బాబ్జీ, గాద నాగేశ్వరరావు తదితరులున్నారు.

యోగా ప్రయోజనాలు తెలియజేయడమే లక్ష్యం

యోగాంధ్ర కార్యక్రమంలో నన్నయ వర్సిటీ వీసీ ప్రసన్నశ్రీ



గోకవరం ఎంపీడీవో కార్యాలయం వద్ద యోగాసనాల శిక్షణ

దివాన్‌చెరువు, మే 28(ఆంధ్రజ్యోతి): యోగా ప్రయోజనాలు ప్రతీఒక్కరికీ తెలియజేయడమే లక్ష్యంగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నన్నయ వర్సిటీలోని బోధనేతర సిబ్బందికి ప్రాణాయామం, ఆసనాలు వాటి ప్రయోజనాలపై బుధవారం కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంతో బాటు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలలు యోగాంధ్ర కార్యక్రమంలో భాగస్వామ్యమై వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. ప్రాణాయామం వల్ల ఒత్తిడి తగ్గి ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరగడంతో బాటు మానసిక ఆరోగ్యం పెరుగుతుందన్నారు. అనంతరం యోగా గురువు ఎస్.శివశంకర్ ప్రాణాయామం, ఆసనాలను సాధన చేయించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికార్లు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

గోకవరం: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో యోగాసనాల శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎం.గోవిందు మాట్లాడుతూ యోగాసనాలతో మానసిక ప్రశాంతతతో పాటు మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. శారీరక, మానసిక రుగ్మతలను అధిగమించడానికి రోజువారీగా అవసరమైన యోగా ప్రక్రియలపై అవగాహన అవసరమన్నారు. అలాగే ఎన్టీఆర్ జయంతి సందర్భంగా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పాలూరి బోస్, ఆయుష్ డాక్టర్ కేదార్, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి: సీపీఐ

రాజమహేంద్రవరం అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని కూరగాయల మార్కెట్‌లోని జట్ల సంఘం భవనంలో సెక్షన్ శాఖ సభ సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. మధు మాట్లాడుతూ 2సెంట్ల స్థలం ఇవ్వడానికి ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేస్తోందన్నారు. ఆగస్టు 5, 6 తేదీల్లో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. మతం పేరుతో రాజకీయలబ్ధి పొందాలనుకుంటున్న ఉన్మాదుల నుంచి దేశాన్ని రక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. సభలో కూండ్రపు రాంబాబు, కొండలరావు, టి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోలింగ్‌బూత్‌ల సర్దుబాటు పనులకు శ్రీకారం

అనపర్తి, మే 28(ఆంధ్రజ్యోతి):ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ బూత్‌ల సర్దుబాటు ప్రక్రియలో భాగంగా అనపర్తి నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌ల సర్దుబాటుపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్లు, బీఎల్‌వోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నియోజవర్గంలో 228 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, వీటిలో 1200 మించి ఓటర్లున్న చోట మిగిలిన ఓటర్లతో కొత్తగా బూత్ ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రారంభించామన్నారు.గురువారం అనపర్తిలో రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట తహశీల్దార్లు అనిల్‌కుమార్, కృష్ణ, సీతాపతి, అనసూయ, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాతో యువతకు ఉద్యోగావకాశాలు

రాజమహేంద్రవరం అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని 1ఎం1బీ వ్యవస్థాపకుడు మానవ్ సుబోధ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ జిల్లా యువతకు జాబ్‌మేళాలతో మరిన్ని ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ సహకారంతో ఉపాధి అవకాశాలను పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. తమ సంస్థ ద్వారా యువతకు సాఫ్ట్‌స్కిల్స్, ప్రొఫెషనల్ ట్రైనింగ్ కూడా అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

కడియపులంకలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కడియపులంకలో జడ్పీ హైస్కూల్ 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

కడియం, మే 28(ఆంధ్రజ్యోతి): కడియపులంక ఉన్నత పాఠశాలలో 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు బుధవారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు సత్యనారాయణ, శ్రీనివాస్, సూర్యబేగం, నాగకుమారి, జోషి, సాయిబాబా, బుజ్జిబాబులను సత్కరించారు. ఈ సమ్మేళనానికి కృషి చేసిన తమ మిత్రులు మల్లు ధనుంజయ్‌కుమార్, తాళం నరేష్, చిటికెన వెంకటేశ్వరరావు, గట్టి ప్రభావతి, సిద్దిరెడ్డి ధనలక్ష్మిలను అభినందించారు.

ఏలూరులో అదృశ్యం.. రాజమహేంద్రవరంలో మృతదేహం

రాజమహేంద్రవరం సిటీ, మే 28(ఆంధ్రజ్యోతి): ఏలూరులో అదృశ్యమైన మహిళ రాజమహేంద్రవరం కోటిలింగాల రేవు సమీపంలో గోదావరి శవమై తేలింది. త్రీటౌన్ పోలీసులు కథనం ప్రకారం.. ఏలూరుకు చెందిన సుంకర కళ్యాణి(32) ఏలూరులో ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. ఆమె కొంత కాలంగా ఎడమ కాలు వాచీ నొప్పుతో నడవలేకపోతోంది. దీంతో ఆమె భర్త తరచూ బైక్‌పై ఆమె పనిచేసే చోట డ్రాప్ చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆరోగ్య సమస్య పెరగడంతో ఉద్యోగం చేసేచోట భర్త ఆమెను దింపి వెళ్లాక భర్తకు ఫోను చేసి తన వల్ల ఇబ్బందులు ఎందుకని చెప్పి ఫోను కట్ చేసింది. దీంతో వెంటనే భర్త కళ్యాణి ఉద్యోగం చేసే చోటకు వెళ్లగా ఆమె బయటకు వెళ్లినట్టు నిర్వాహకులు చెప్పారు. దీంతో చుట్టుపక్కల వెతికినా కళ్యాణి కనిపించకపోవడంతో తన భార్య అదృశ్యమైనట్టు ఏలూరు త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. బుధవారం రాజమహేంద్రవరం కోటిలింగాల రేవులో ఓ మహిళ మృతదేహం తేలడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ మృతదేహం ఏలూరులో అదృశ్యమైన కళ్యాణిగా పోలీసులు గుర్తించి అక్కడ పోలీసులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

ధవళేశ్వరం, మే 28(ఆంధ్రజ్యోతి): పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆర్ అండ్ఆర్ యూనిట్‌లలో సీనియర్ అసిస్టెంట్, వర్కింగ్ ఇన్స్పెక్టర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఆఫీస్ సబార్డినేట్ పోస్టులలో ఔట్‌సోర్సింగ్ విధానం ద్వారా నియమించడానికి ఈనెల 6,7, 9 తేదీల్లో రాత పరీక్ష నిర్వహించగా ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలను బుధవారం ధవళేశ్వరంలోని ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ కార్యాలయంలో నిర్వహించారు. ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ఐఏఎస్ అధికారి వి.అభిషేక్ పర్యవేక్షణలో ఎడమ ప్రధాన కాలువ భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సతీష్, చింతూరు డివిజన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్‌లు ఆధ్వర్యంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

రాజధానికి మరో 44 వేల ఎకరాలు ఎందుకు?

సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యురాలు టాన్యా

రాజమహేంద్రవరం అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానికి మరో 44 వేల ఎకరాలు కావాలని సీఎం చంద్రబాబు చేస్తున్న ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యురాలు పి.టాన్యా అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని అంబేద్కర్ భవన్‌లో 'అమరావతికి అదనంగా 44 వేల ఎకరాల భూమి ఎందుకు' అనే అంశంపై సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉభయగోదావరి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ అదనంగా భూసేకరణ పేరుతో రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని అన్నారు. ఈ భూ సమీకరణ ఆలోచన మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సభకు అధ్యక్షవర్గంగా ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వి.చిట్టిబాబు, ఏఐకేఎంఎస్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు సముద్రాల సుందరం వ్యవహరించారు. సీపీఐ ఎంఎల్ జనశక్తి జిల్లా కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు తలారి ప్రకాశ్, జిల్లా సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం నగర కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ మాట్లాడారు. ఈ సభలో అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి భీమశంకర్, భానుప్రసాద్, సిద్ధు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చిత్రకళా శిబిరంలో విద్యార్థులకు బహుమతి ప్రదానం

రాజమహేంద్రవరం కల్చరల్ మే 28(ఆంధ్రజ్యోతి): విశ్వ విఖ్యాత చిత్రకారులు వర్ధిల్లిన రాజమండ్రి చిత్ర కళాఖ్యాతిని ప్రపంచానికి చాటాలని చిన్నారులకు ప్రముఖ న్యాయవాది మద్దూరి శివసుబ్బారావు సూచించారు. దామెర్ల రామారావు చిత్రకళా గ్యాలరీలో నెల రోజులుగా జరుగుతున్న వేసవి చిత్రకళ శిబిరంలో విద్యార్థులకు బుధవారం బహుమతి ప్రదానం చేశారు. నిర్వాహకుడు మాజేటి రవిప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 150 మంది చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఆంధ్ర కేసరి యువజన సమితి పూర్వ అధ్యక్షుడు దేశిరెడ్డి బలరామనాయుడు, పార్క్ స్వాతంత్ర సమరయోధులు పార్క్ కన్వీనర్ మాదిరాజు శ్రీనివాస్, ప్రముఖ చిత్రకారుడు తారా నగేష్, చిత్రకళ, చేతిరాత, క్రాఫ్ట్ రంగాల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు చిత్రకళ తయారీ వస్తువులను అందించారు.

బాలిక అదృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, మే 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రెవెన్యు కాలనీకి చెందిన 17 ఏళ్ల బాలిక ఈనెల 26 నుంచి కనిపించడంలేదని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. నర్సింగ్ చదువుతున్న ఈ బాలికకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక యువకుడు పరిచయం అయ్యాడని ఆ యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు సీసీ కెమెరాల వితరణ

రాజమహేంద్రవరం, మే 28(ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు రాజమహేంద్రవరంలోని జాన్ వెస్లీ ఫౌండేషన్ తరపున 60 సీసీ కెమెరాలు, డీవీఆర్ బాక్సులు, హార్డ్ డిస్కులు, కేబుల్స్, సీసీ ఫుటేజీ నిల్వకు అవసరమైన పరికరాలను పాస్టర్ జాన్ వెస్లీ బుధవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా వారికి సీఐ అప్పా రావు కృతజ్ఞతలు తెలిపారు.



ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, జవహర్



ఇసుకాసురుడు!

ప్రభుత్వం మారినా..ఫ్యాన్ నేతదే పెత్తనం

- కాకినాడకు రెండు రీచ్‌లు
- పొడగట్లపల్లి,కాటవరం కేటాయింపు
- అక్కడ వైసీపీ నేత గుత్తాధిపత్యం
- ద్వారంపూడి అనుచరుడి దందా
- తెరముందు వేరే కంపెనీలు
- తెరవెనుక ఇష్టారాజ్యం
- స్టాక్‌యార్డులకు ఇసుక ససేమిరా
- ఇసుక అందక ప్రజల ఇబ్బందులు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ప్రభుత్వం మారినా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కొన్ని ఇసుక రీచ్‌లపై వైసీపీ నేతల పెత్తనం కొనసాగుతూనే ఉంది. ఏ మాత్రం జంకుబొంకు లేకుండా అధికారుల సాయంతో రీచ్‌లపై పెత్తనం చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వం మారినా ఆధిపత్యం చలాయిస్తున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇసుక, గ్రావెల్ తవ్వకాల్లో హవా కొనసాగించిన కాకినాడ సిటీ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి అనుచరుడు ఇప్పుడు తనకు ఎదురులేదన్నట్టు వ్యవహరిస్తున్నాడు. కాకినాడ జిల్లాలో స్టాక్‌యార్డులకు ఇసుక సరఫరా చేసేందుకు కేటాయించిన రెండు ర్యాంపుల్లో పాగావేసి అడ్డగోలుగా వ్యవహరిస్తున్నాడు.స్టాకుయార్డు నిర్వాహకులకు ఇసుక ఇవ్వాల్సి ఉండగా నిరాకరిస్తున్నారు. ఆ ఇసుకను విశాఖతో పాటు ఇతర ప్రాంతాలకు అడ్డగోలుగా విక్రయించేసుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా యార్డులను దక్కించుకున్న నిర్వాహకులు జనానికి ఇసుక సరఫరా చేయలేక తలపట్టుకుంటున్నారు.

ప్రభుత్వం చేసిందిదే..

చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇసుక విధానంలో మార్పు తీసుకువచ్చింది. ఇసుక ఉచితంగా తవ్వుకునేలా ఆదేశాలిచ్చింది. వర్షాకాలంలో ఇసుకకు ఇబ్బందులు లేకుండా నియోజకవర్గాల్లో స్టాకుయార్డులను ఏర్పాటు చేసింది. వర్షాలు రావడానికి ముందే రీచ్‌ల నుంచి ఇసుక తెచ్చి వీటిలో నిల్వ చేసుకునేలా ఆదేశాలు జారీచేసింది.అందులో భాగంగా కాకినాడ జిల్లాలో పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురంలోని చిత్రాడ,కరపలోని ఉప్పలంకలో స్టాకుయార్డులకు దరఖాస్తులను ఆహ్వానించి కంపెనీలను ఎంపిక చేసింది. వీటిని దక్కించుకున్న స్టాకుయార్డు నిర్వాహకులకు కోనసీమ జిల్లా రావులపాలెం మండలం పొడగట్లపల్లి,తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం కాటవరం ఇసుక ర్యాంపులను ప్రభుత్వం కేటాయించింది.ర్యాంపుల్లో ఇసుక తవ్వి స్టాకుయార్డు నిర్వాహకులకు విక్రయించేందుకు వీలుగా గనుల శాఖ కొన్ని నెలల కిందట కంపెనీలను ఆహ్వానించింది.పొడగట్లపల్లి ర్యాంపు తేజ ఇన్‌ఫ్రాటెక్, కాటవరం ర్యాంపు మిథులా కన్‌స్ట్రక్షన్ దక్కించుకున్నాయి.రెండు కంపెనీలు ఆయా ర్యాంపుల నుంచి కాకినాడ జిల్లా స్టాకుయార్డులకు ఇసుకను తవ్వి విక్రయించాలి. కానీ ఇక్కడే కథ మలుపు తిరిగింది.

దోపిడీ సాగుతుందిలా..

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆ పార్టీ నేతలు ఇసుకను అడ్డగోలుగా దోచేసి వందల కోట్లకు పడగలెత్తారు. జనానికి ఇసుక దొరకకుండా చేసి అధిక ధరకు విక్రయించేసుకున్నారు.ఇప్పుడూ అదే చేస్తున్నారు. రెండు ర్యాంపులను దక్కించుకున్న కంపెనీలతో తెర వెనుక ద్వారంపూడి అనుచరుడైన ఓ హోటల్‌ను ఇంటిపేరుగా మార్చుకుని హవా చెలాయిస్తున్న నేత ఒప్పందం కుదుర్చుకున్నాడు. రెండు ర్యాంపుల్లో పాగావేసి ఇప్పుడు అడ్డగోలుగా ఇసుక తవ్వేస్తున్నారు. ర్యాంపుల్లో ఇసుక కాకినాడ జిల్లా స్టాకుయార్డులకే ఇవ్వాల్సి ఉండగా బిల్లులు లేకుండా బయటకు అధిక ధరకు విక్ర యించేసుకుంటున్నారు. తీరా తమ స్టాకు యార్డుకు ర్యాంపు నుంచి ఇసుక ఇవ్వాలని వెళుతున్న నిర్వాహకులను బెదిరిస్తున్నాడు. ఇసుక కోసం వెళ్లిన లారీలను సైతం వెనక్కు తిప్పి పంపిచేస్తున్నారు. అయినా రీచ్‌లు అధికారికంగా దక్కించుకున్న కంపెనీలు విషయం తెలిసి సదరు నేతకు సహకరిస్తున్నాయి. ద్వారంపూడి అనుచరుడు కాకినాడసిటీలో భూదాన్ భూమిలో కేటాయించిన స్టాకుయార్డును గుప్పిట్లో ఉంచుకుని తన ఆధీనంలో ఉన్న రెండు ర్యాంపుల నుంచి భారీగా ఇసుక తరలించేస్తున్నారు. ఇతర స్టాకుయార్డులకు మాత్రం ఇసుక ఇవ్వకుండా గుత్తాధిపత్యం చెలాయిస్తున్నాడు. తాజాగా కాకినాడ సిటీ యార్డును భూదాన్ భూమి నుంచి తరలించాలని హైకోర్టు ఆదేశించడంతో ఇప్పుడు ఆ యార్డును గనులశాఖ రద్దు చేసింది.మరో పక్క వైసీపీ ఐదేళ్ల పాలనలో సదరు నేత అనుచరుడు కాకినాడ జిల్లాలో చెలరేగిపోయాడు. కనిపించిన చెరువులు,కొండల్లో గ్రావెల్ తరలించి కోట్లలో సంపాదించాడు. ఇప్పుడు ప్రభుత్వం మారిన తర్వాత కూడా ఇసుక ర్యాంపులను గుప్పిట పెట్టుకుని సదరు నేత అనుచరుడు అడ్డగోలుగా ఆధిపత్యం చెలాయిస్తున్నా అధికారులు కిమ్మనడం లేదు.

ఏరువాక సాగారో!



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

- 73,812 హెక్టార్లలో వరిసాగు
- 36,906 క్వింటాళ్ల విత్తనాలు
- కాలువల పనులు జాప్యం
- జూన్ 10లోపు నీరు
- 43 వేల బోర్లతో సాగు
- సన్నద్ధమవుతున్న రైతులు

నైరుతి రుతు పవనాలు వస్తుండడంతో జిల్లాలో రైతాంగం ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతోంది. జూన్ నెల వస్తుండడంతో రైతులు ఖరీఫ్‌కు సిద్ధమవుతున్నారు.ప్రతి ఏటా జూన్1న డెల్టా కాలువలకు నీరు విడుదల చేస్తుంటారు. ఈ ఏడాది కాలువల మరమ్మతుల పనులు ఆలస్యంగా ప్రారంభించడంతో నీటి విడుదల జాప్యంకానుంది.ఈ మేరకు జూన్ 10వ తేదీ లోపు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ఖరీఫ్ సీజన్ ఆలస్యం అయ్యేలా ఉంది. అయితే బోర్ల ద్వారా నారుమళ్లు వేసే రైతులు ఉన్నారు. జిల్లాలో ముఖ్యంగా కొవ్వూరు డివిజన్‌తో పాటు రాజానగరం,అనపర్తి, రాజమండ్రి రూరల్ ప్రాంతాల్లో సుమారు 43 వేల బోర్లు ఉన్నాయి. వీటి సహాయంతో నారుమళ్లు వేస్తారు.

36,906 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం

జిల్లాలో వరి సాగుకు 36,906 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం చేశాం. ప్రైవేట్ డీలర్ల 3690 క్వింటాళ్ల.. రైతు నుంచి రైతుకు 32,816 క్వింటాళ్ల వినియోగానికి సిద్ధంగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా 400 క్వింటాళ్ల విత్తనాలు జూన్ మొదటి వారంలో రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తాం.

\- కలెక్టర్ ప్రశాంతి

ఖరీఫ్ యాక్షన్ ప్లాన్

జిల్లా ఖరీఫ్ సాగుపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్టు జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు తెలిపారు. జిల్లాలో ఖరీఫ్ 2025 పంట కాలానికి సంబంధించి 80,918 హెక్టార్లలో వివిధ రకాల పంటలు వేసే అవకాశం ఉంది. అందులో 77,820 హెక్టార్లలో వరి, 2,595 హెక్టార్లలో మినుము, 181 హెక్టార్లలో ఇతర పంటలు సాగు చేస్తారు. వరికి 38,910 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం. ఇందులో 400 క్వింటాళ్ల విత్తనాలను రైతులకు ప్రభుత్వం రాయితీపై అందిస్తుంది.జిల్లాలో 90 శాతం రైతు వారీ విత్తనాలే ఉంటాయి.10 శాతం లైసెన్స్ విత్తనాల అమ్మకదారుల నుంచి కొనుగోలు చేస్తారు. ఈ సారి సన్నరకాలైన ఎంటీయూ 1224, బీపీటీ 2841, బీపీటీ 2270, టీటీపీ 2846, ఎస్ఎల్ఆర్ 3238 వంటి రకాలతో పాటు ఎంటీయూ 1318 వంటి నూతన రకం సాగు చేయవచ్చని అధికారులు అంచనా వేశారు. భూసార పరీక్షలకు 20,431 నమూనాలు సేక రించడం లక్ష్యంకాగా ఇప్పటి వరకూ 9,050 నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పం పారు.భూసార పరిరక్షణ చర్యల్లో భాగంగా 9 రకాల విత్తనాలతో తయారుచేసిన కిట్లు జిల్లాలో ఇప్పటి వరకూ 14,047 పంపిణీ చేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో జిల్లాకు 64,157 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం.ఇప్పటి వరకూ జిల్లాలో 24,258 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ ఉన్నాయి. జిల్లా పంట సాగుదారు హక్కుల పత్రం (సీసీ ఆర్‌సి)కింద 1,10,000 కార్డులు పంపిణీ చేయ వలసి ఉండగా ఇప్పటి వరకూ 10,958 పంపిణీ చేశారు.



నృత్య ప్రదర్శన



ఎన్‌టీఆర్ ఫొటో ఎగ్జిబిషన్ తిలకిస్తున్న జవహర్, కలెక్టర్

ఎన్‌టీఆర్‌కు ఘన నివాళి

రాజమహేంద్రవరం రూరల్ మే28(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ 102వ జయంతిని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ప్రశాంతి, ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్, జేసీ ఎస్.చిన్నరాముడు తదితరులు ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఎన్టీఆర్ జయంతిని మొదటిసారిగా రాష్ట్ర పండుగగా అధికారికంగా జరుపుకుంటున్నామన్నారు. ఎన్టీఆర్ కేవలం కథానాయకుడు మాత్రమే కాదని, ఒక పరిపూర్ణమైన నటుడన్నారు.వివక్షలేని సమాజం కోసం ఆనాడు తెలంగాణలో పటేల్, పట్వారీ వ్యవస్థ రద్దు చేసి నూతన పాలసీ ఒరవడికి ఎన్టీఆర్ ఆద్యుడయ్యారని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ అన్నారు. ఎన్టీఆర్ వంటి మహానుభావుల జీవితం నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకోవాలని జేసీ చిన్నరాముడు అన్నారు.కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ ఫొటోల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విజయ శంకర సంగీత నృత్యకళాశాల కూచిపూడి నృత్య రూపకం ఆకట్టుకుంది.



కడుపు నిండా తిండి పెట్టండి.. కంటిపై కునుకు వేస్తే చితక్కొట్టండి.. ఈ డైలాగు ఏదో ఫేమస్ సినిమాలో విన్నట్టుంది కదూ!.అవును.. విలన్‌ని ఉద్దేశించి పోలీస్ అధికారి ఇచ్చే ఆదేశమది. ఇప్పుడు మందుబాబుల పరిస్థితి కూడా కాస్త అటూ ఇటుగా అలాగే ఉంది. పిచ్చి బ్రాండ్లు.. నాసిరకం మందు.. అధిక ధరలతో ఐదేళ్లు విసిగిపోయారు. ప్రస్తుత ప్రభుత్వంలో నాణ్యమైన మద్యం అందుబాటులోకి వచ్చినా స్వేచ్ఛగా తాగడానికి వీల్లేక సతమతమైపోతున్నారు.

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పట్టుకుంటే.. పది వేలు!

మందెక్కడ తాగాలి మహాప్రభో

- పర్మిట్ రూంలు లేక ఇబ్బంది
- బయట తాగితే నేరం..ఫైన్
- చుక్క పడాలంటే సాహసమే
- ఉమ్మడి జిల్లాలో 455 షాపులు
- మందుబాబులు సతమతం
- పోలీస్‌ల నిఘాతో గగ్గోలు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాణ్యమైన మద్యం అందు బాటులోకి వచ్చింది. సుమారు 200 బ్రాండ్లు కళ్లెదుట కనబడుతున్నాయి. కానీ చుక్క గొంతులో పోసుకోవడానికి సాహసం చేయాల్సి వస్తోంది. దీనికి కారణం చుక్క మింగడానికి చోటు లేకపోవడమే. ఇంట్లో అనుమతి ఉండదు.. బయట నాలుక తడుపుకుందామంటే నేరం.. బార్‌లకు వెళదామంటే అదనపు ధరలు.. ఎక్కడో చోట ఏదోలా తాగేసి ఇంటికి పోదామంటే నోట్లో గొట్టం పెట్టి ఊద మనే పోలీసులు.. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం నాణ్యమైన సరుకు..సరసమైన ధరలు తెచ్చిందని సంతోషించాలా?.. తాగ డానికి జాగా లేదని నొచ్చుకోవాలా అని సగటు మద్యం వినియోగదారుడు ప్రశ్నిస్తున్నాడు. విసిగిపోయి పాలకులపై చిందులేస్తున్నాడు.

ఎక్కడ తాగేది?

వైసీపీ ప్రభుత్వంలో సామాన్యులు క్వార్టరు తాగాలంటే రూ.500 ఆవిరైపోయేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చిన దరిమిలా మందుబాబులకు మళ్లీ మంచిరోజులు వచ్చాయి. అయితే పర్మిట్ రూంలు లేక తాగడానికి ఇబ్బందులు పడుతున్నారు. మద్యం దుకాణాల వద్ద అనధికారికంగా సిట్టింగ్‌లు ఉన్నా బెరుగ్గానే తాగాల్సిన పరిస్థితి ఉంది. బార్‌లకు రెండేళ్ల లైసె న్సును గత వైసీపీ ప్రభుత్వం మంజూరు చే సింది. ఈ ఏడాది సెప్టెంబరు వరకూ బార్‌లకు అనుమతి ఉండడంతో కూటమి కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చే సమయంలో బార్‌లతో ఒక ఒప్పందం జరిగింది. బార్‌ల లైసెన్సు గడువు ముగిసే వరకూ పర్మిట్ రూంలకు అనుమతులివ్వబోమని.తీరా ప్రైవేటు మద్యం షాపులు అందుబాటులోకి వచ్చిన తర్వాత తాగడానికి వీల్లేక నాణ్యమైన మందు దొరుకుతున్నా ప్రభుత్వ ఉద్దేశం పూర్తిగా నెరవేరడం లేదు. కొందరు మద్యం తాగుతారని వాళ్ల ఇళ్లల్లో తెలియకుండా జాగ్రత్త పడతారు. మరి కొం దరికి ఇంట్లో తాగే పరిస్థితులు ఉండవు.చాటుమాటు ప్రదేశంలో మద్యం తాగాలన్నా డేగ కళ్లతో తిరుగుతున్న పోలీసులకు చిక్కామా అంతే. తొలుత కేసు..తర్వాత కోర్టు.. ఆపై రూ.10 వేల ఫైన్. క్వార్టరు మందు రూ.200కే అందుబాటులో ఉన్నా..దానిని ఇంటి బయట గొంతు దాటించాలంటే మాత్రం మరో రూ.15 వేల ఖర్చుకు సిద్ధపడాల్సిందే.ఇప్పుడు ఎక్సైజ్ శాఖ దుకాణాల వద్ద తాగితే ఊరుకోబో మం టూ పెట్రోలింగ్ మొదలుపెట్టింది.ఈ పరిస్థితుల్లో చాలా మంది స్నేహితుల రూంలు,జన సంచారం లేని ప్రాంతాల్లో భయంభయంగానే పని కానిస్తున్నారు.

31% దాటితే రూ.10వేలు

పోలీసులు బ్రీత్ ఎనలైజర్‌తో చెక్ చేస్తుం టారు.రక్తంలోని మద్యం శాతాన్ని అది కొలు స్తుంది.బ్రీత్ ఎనలైజర్‌కి ఉంచే గొట్టంలో ఎవరు ఊదినా బీప్ శబ్దం వస్తుంది. కానీ 31% ఆపై రీడింగ్ చూపిస్తే మాత్రం సదరు వ్యక్తి ఫొటోతో సహా ఆన్‌లైన్‌లో నమోదైపోవడంతో పాటు కేసు నమోదవుతుంది. పోలీసులు చెప్పిన సమయానికి కోర్టుకు వెళితే రూ.10 వేలు ఫైన్. ఆపై బయట 'ఇతర' ఖర్చులూ ఉంటాయి. కల్లు తాగినా, ఓ లైటు బీరు కొట్టినా రీడింగ్ 31 దాటిపోతోందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేసులు 4926..

తూర్పుగోదావరిలో 138, డా.బీ ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 146, కాకినాడ జిల్లాలో 171 మొత్తం మన్యం మినహా ఉమ్మడి తూర్పులో 455 ప్రైవేటు మద్యం దుకాణాలు ఓ 50 బార్లు ఉన్నాయి. డ్రంకెన్ డ్రైవ్ కేసులు ఈ ఏడాది ఇప్పటి వరకూ తూర్పుగోదావరిలో 496 కేసులు నమోదు చేయగా 245 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా వేయగా 16 మందికి జైలు శిక్ష పడింది. 217 కేసులు విచారణ జరగాల్సి ఉంది. కోనసీమలో 1230, కాకి నాడ జిల్లాలో 3200 కేసులు పెట్టగా రూ.20 లక్షల వరకూ మందుబాబులు ఫైన్లు కట్టారు.



చేస్తే..ఉపయోగమే!

రాజమహేంద్రవరం, మే 28 (ఆంధ్ర జ్యోతి): యోగా సాధన జీవనంలో ఒక అలవాటుగా మారాల్సిన అవసరం ఉందని జేసీ చిన్న రాముడు అన్నారు.యోగాంధ్రలో భాగంగా బుధవారం ఆర్ట్స్ కళాశాల రోడ్డులో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో యోగా సాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.మానసిక, శారీరక ఇబ్బందులు అధిగమించడానికి యోగా మంచి మార్గమన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సీతారామ మూర్తి, విజయ కుమారి,ఆయుష్ వైద్యుడు రమేశ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ జిల్లా అధికారిగా మూర్తి బాధ్యతలు



రాజమహేంద్రవరం అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ తూర్పుగోదావరి జిల్లా అధికారి (డీపీటీవో)గా వైఎస్ఎన్ మూర్తి బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. తాడేపల్లిగూడెం ఆర్టీసీ డీఎంగా పనిచేస్తున్న మూర్తిని ఉన్నతాధికారులు పదోన్నతిపై ఇక్కడ నియమించారు. జిల్లా అధికారిణిగా పనిచేసిన షర్మిల అశోక కొద్దిరోజుల క్రితం విజయవాడ వర్క్స్ మేనేజర్‌గా బదిలీపై వెళ్లడంతో కోనసీమ జిల్లా ఆర్టీసీ అధికారి రాఘవకుమార్‌కు ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు.జిల్లా ఆర్టీసీ అధికారిగా వైఎస్ఎన్ మూర్తి పూర్తిస్థాయి బాధ్యతలతో కొనసాగనున్నారు.

పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత ఉండాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీ లక్ష్మీ

రాజమహేంద్రవరం,మే 28(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ/పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మీ ఆదేశించారు.డీఎల్ఎస్ఏలో బుధవారం 'పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిషేధ చట్టం-2013'పై పారా లీగల్ వలంటీర్లకు అవగాహన కల్పించారు.సమస్య డీఎల్ఎస్ఏ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎస్ఈబీ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శామ్యూల్

ఇంజనీర్ల పోస్టులు భర్తీ చేయాలి : శామ్యూల్

రాజమహేంద్రవరం సిటీ, మే 28 (ఆంధ్రజ్యోతి): ఏపీలో విద్యుత్ పంపిణీ సంస్థ లతో సహ ట్రాన్స్‌కో -జెన్‌కోతో కలుపుకుని క్షేత్రస్థాయిలో వెయ్యికి పైగా ఏఈల పోస్టులు ఖాళీగా ఉన్నాయని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కపల్లి శామ్యూల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీఎస్ఈబీ ఇంజనీర్స్ అసోసియేషన్ రాజమహేంద్రవరం బ్రాంచ్ సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఇంజనీర్ల నియామకం జరగకపోతే భవిష్యత్‌లో ఆందోళనకర సమస్యలు వస్తాయన్నారు.2022 పే రివిజన్‌తో 1800 మంది ఇంజనీర్లు నష్టపోయారన్నారు విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే యోచనను కేంద్రం విరమించుకోవాలన్నారు.ప్రభుత్వం ఇంజనీర్ల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. సమావేశంలో సంఘ స్టేట్ జనరల్ సెక్రటరీ నాగప్రసాద్, అసోసియేట్ సెక్రటరీ కెవి.రామారావు,రాజమండ్రి బ్రాంచ్ కార్యదర్శి రత్నాలరావు పాల్గొన్నారు.

13 రహదారులకు రూ.24.82 కోట్లు

రాజమహేంద్రవరం రూరల్ మే28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రూ.24.82 కోట్ల నాబార్డు నిధులతో 13 రహదారులకు నిధులు మంజూరు చేసినట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడు నియోజకవర్గాల పరిధిలో 38.61 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణాలు, మరమ్మతులు చేపడతారన్నారు. రంగంపేట మండలంలో మర్లపూడి-ఆర్వీపట్నం, అనపర్తి మండలం పరిధిలో దుప్పలపూడి-కాపవరం రహదారి పునర్నిర్మాణ పనులకు రూ.3.20 కోట్లతో 6.37 కిలోమీటర్లు, రాజమహేంద్రవరం రూరల్ మండల పరిధి కాతేరు- స్నానఘట్టం వరకు, కడియం మండల పరిధి జేగురుపాడు, కడియం, కె.సావరం,మాధవరాయుడుపాలెం రహదారుల పనులకు గాను రూ.3.30 కోట్లతో 6.02 కిలోమీటర్లు వేస్తారన్నారు. సీతానగరం మండల పరిధి సీతానగరం-పురుషోత్తపట్నం వరకు రూ.3.25 కోట్లతో 3.05 కిలోమీటర్లు, గోకవరం మండల పరిధి గోకవరం-ఆర్.యర్రంపాలెం వరకు రూ.1.50 కోట్లతో 2.80 కిలోమీటర్లు, నల్లజర్ల మండలం పరిధి చోడవరం-గుండెపల్లి, కంచెర్లగూడెం-సంజీవపురం రహదారి నిమిత్తం రూ.3.30 కోట్లతో 5.10 కిలోమీటర్లు, కొవ్వూరు మండలం పరిధి పెనకనమెట్ట- కుమారదేవం బీటీ రోడ్డు పనులకు రూ.2.70 కోట్లతో 3.67 కిలోమీటర్లు, ఉండ్రాజవరం మండలం పరిధిలో పైడిమర్ల-సత్యవాడ, పెరవలి మండల పరిధి కానూరు, నడుపల్లికోట, నిడదవోలు మండల పరిధి సింగవరం- నందమూరు, పెరవలి మండల పరిధి కాపవరం-కొత్తపల్లి అగ్రహారంలో రూ.7.37 కోట్లతో 11.60 కిలోమీటర్ల రహదారుల పనుల చేపడతారన్నారు. ఈ మేరకు నాబార్డుద్వారా నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు.

ఎస్సీ యువతకు లెదర్ ఫుట్‌వేర్‌లో శిక్షణ

రాజమహేంద్రవరం, మే 28 (ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉపాధి నిమిత్తం లీడ్ క్యాప్, సీడాప్ సంస్థల ద్వారా లెదర్ ఫుట్‌వేర్ తయారీ కోర్సులో చేరుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా షెడ్యూల్డు కులాల సహకార సంఘం లిమిటెడ్ కార్యనిర్వాహక సంచాలకులు జె.సత్యవతి తెలిపారు. వివిధ విభాగాల్లో శిక్షణకు పదో తరగతి అర్హతని, వయసు 18-35ఏళ్ల మధ్య ఉండాలన్నారు. గుంటూరు జిల్లా నల్లపాడులోని శ్రీ కృష్ణ సాయి ఎడ్యుకేషన్ సొసైటీలో శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 9030924569 నెంబరులో సంప్రదించాలన్నారు. ఈ మేరకు ఎస్సీ నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్

సమ సమాజమే లక్ష్యంగా టీడీపీ స్థాపన

● రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ ● ఘనంగా ఎన్టీఆర్ జయంతి
● ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన నాయకులు



కడపలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు, నాయకులు



కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

కొవ్వూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): అన్న నందమూరి తారక రామారావు సమసమాజమే లక్ష్యంగా తెలుగుదేశంపార్టీని స్థాపించారని మాజీ మంత్రి, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్ అన్నారు. జవహర్ నివాసంలో ఏన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజలే దేవుళ్ల సమాజమే దేవాలయం అనే నినాదంతో పార్టీని స్థాపించి తెలుగువారి ఖ్యాతిని ప్రపంచానికి తెలియజేశారన్నారు. పాలనలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం అందరూ పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వేగి చిన్నా, ఆత్కూరిరాంబాబు, బూరుగుపల్లి రాఘవులు, పనలపూడి బోసు, బిక్కిన ఫణీంద్ర, అన్నమరెడ్డి రాజబాబు, పి.వి.వి. భద్రం, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ చైతన్యం తెచ్చింది ఏన్టీఆర్

తెలుగుదేశం పార్టీని స్థాపించి ప్రజలలో రాజకీయ చైతన్యం తీసుకువచ్చిన ఘనత దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావుకే దక్కుతుందని కొవ్వూరు అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ అన్నారు. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏన్టీఆర్ జయంతిని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో పట్టణ, మండల అధ్యక్షులు దాయన రామకృష్ణ, వట్టికటి వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి ఏన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ సెంటర్, 7వ వార్డులో, విజయవిహార్ సెంటర్‌లలో ఎన్టీఆర్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మద్దిపట్ల శివరామకృష్ణ మాట్లాడుతూ పార్టీని స్థాపించి తెలుగుజాతి గౌరవాన్ని ప్రపంచ వ్యా ప్తంగా చాటిచెప్పారన్నారు. ఎంపిపి కాకర్ల నారాయుడు, మద్దిపాటి సత్యనారాయణ, చావా శ్రీనివాస్, సర్పంచ్‌లు పొలడుగుల లక్ష్మణరావు, మేకల శ్రీను, నాయకులు రాజాన శ్రీనివాస్, కాగిత రఘు, అర్జిల్లి రామకృష్ణ, సున్నా సాయి, మద్దుల సత్యనారాయణ, నాళం వి.వి.శ్రీనివాసరావు, కంటిపూడి శ్రీనివాస్, నగేష్, గారపాటి వెంకటకృష్ణ, రామకృష్ణ, సతీష్, కెవికె రంగారావు, పెనుమాక జయరాజు, వరిగేటికాంత రాజు, గొరిజాల సురేష్, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ జయంతి మండలంలో ఆయా గ్రామాల్లో వేడుకగా నిర్వహించారు.టీడీపీ సీనియర్ నాయకులు నందమూరి నారాయణరావు, కంటిపూడి సూర్యనారాయణ పలువురు ఎన్‌టీ ఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కొత్తపల్లి అగ్రహారం గ్రామంలో వేడుకగా నిర్వహించారు. సర్పంచ్ బండారు వెంకట రమణ , సాయిబాబా నిడదవోలు నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు అబ్బిశెట్టి సత్తిరాజు, గ్రామపార్టీ అధ్యక్షుడు బర్రె దొర స్వామి, బండారు సత్యం పాల్గొన్నారు. కానూరులో టీడీపీ పార్టీ గ్రామ అధ్యక్షుడు ముళ్లపూడి రాజేంద్ర ప్రసాద్, వై.నాట్ సంస్థల అధినేత జుజ్జవరపు వెంకటరాయుడు, బూరుగుపల్లి నారాయణరావు, శిరిగినీడి శేషగిరిరావు, కొమ్మిశెట్టి బూరయ్య, యడ్లచంటి, బూరుగుపల్లి రాజు, మొగళ్లపు సీతారామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

నిడదవోలు : పట్టణంలోని పంగిడి రోడ్డులో ఉన్న నందమూరి తారక రామారావు విగ్రహం వద్ద ఆయన జయంతిని పురస్కరించుకుని నిడదవోలు పట్టణ టీడీపీ నాయకులు కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

● మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతిని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా చేయాలని ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో బుధవారం తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఎన్టీఆర్ జయంతిని అధికారికంగా నిర్వహించారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. అధికారికంగా ఉత్తర్వులు ఉన్నా ఎన్టీఆర్ జయంతిని జరపని మున్సిపల్ కార్యాలయం కూటమి ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి మే 28న అధికారికంగా జరపాలని ఉత్తర్వులు జారీ చేసినా నిడదవోలు మున్సిపల్ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతిని జరపకపోవడంపై టీడీపీ నాయకులు కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిడదవోలు పురపాలక సంఘ అధికారులు సిబ్బంది వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఏజెంట్లుగా పనిచేస్తున్నారని కూటమి ప్రభుత్వం అధికారికంగా జారీ చేసిన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలుగు తమ్ముళ్ల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పురపాలక సంఘ అధికారులపై చర్యలు తీసుకోవాలని నిడదవోలు టీడీపీ డిమాండ్ చేసింది.

తాళ్లపూడి: మండలంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జన్నకూటి పోసిరాజు అధ్యక్షతన ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆఫీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇంచార్జి తహసీల్దార్ మోహనభారతి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, ఆర్ఐ రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. మలకపల్లి, అన్నదేవరపేట, పోచవరం, పెద్దేవం గ్రామాల్లో ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో చెరుకూరి వెంకట్రావు, సర్పంచ్ రాపాక రాజేశ్వరి, మాజీ సర్పంచ్ మద్దిపాటి ప్రకాశరావు, మద్దినాటి రామారావు, మద్దుకూరి బుచ్చిరాయుడు, సుంకవల్లి సత్తిబాబు, గెడ్డం జగజ్జీవన్, పరిటాల సతీష్ మైనంగంగరాజు, మైనం వెంకటేశ్వరరావు, కవల రామాంజనేయులు, అనపర్తిప్రసాద్, డీఈ శంకరం, తిగిరిపల్లి గోపి, తిగిరిపల్లి కనకరత్నం, బోడపాటి గంగరాజు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లు సెంటర్‌లో ఎన్‌టీఆర్ విగ్రహంవద్ద మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ళ హరిబాబు పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంచారు. శ్రీశ్రీనివాస నర్సరీ అధినేత కోడూరి శ్రీనివాసరా వు ఆర్థిక సహకారంతో కూరగాయల మొక్కలు, విత్తనాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు కోడూరి సతీష్, కేతా సాహె బ్, ఆళ్ళ సూర్యప్రకాశరావు, రావిపాటి రాధా కృష్ణ, జొన్నకూటి సుబ్బారావు, అల్తాఫ్ అహ్మద్, వెంకాయమ్మ, ఊబా దుర్గ తదితరులు పాల్గొన్నారు. నెలటూరులో జరిగిన కార్యక్రమంలో తాళ్ళూరి ప్రసాద్, తాళ్ళూరి శ్రీనివాసరావు, నందిగం సురేష్, ఈడుపుగంటి సుబ్బారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొని ఘనంగా నివాళి అర్పించారు. ఊనగట్ల సెంటర్‌లో జరిగిన జయంతి వేడుకల్లో నల్లూరి సూరిబాబు, నందిగం శ్రీని వాసరావు (దత్తుడు), మనెల్లినాని, కారింకి సత్యన్నారాయణ, పెనుమర్తి కిషోర్, నందిగం విష్ణు పాల్గొన్నారు. బ్రాహ్మణగూడెం, కలవలపల్లి, దారవరం, గౌరిపల్లి, మల్లవరం చిక్కాల తదితర గ్రామాల్లోను ఎన్‌టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించి ఆయనకు నివాళి అర్పించారు.

దేవరపల్లి: బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని గ్రామ కమిటీ అధ్యక్షుడు గద్దే సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు పేర్కొన్నారు. దేవరపల్లి మండలంలో ఎన్‌టీఆర్ జయంతి వేడుకలు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. త్యాజంపూడి, చిన్నాయిగూడెం, సంగా యిగూడెం, యాదవోలు, యర్నగూడెం, పల్లంట్ల, కురుకూరు, దుద్దుకూరు, గౌరీపట్నం, దేవరపల్లి గ్రామాల్లోని ఎన్‌టీఆర్ విగ్రహాలకు ఆయా గ్రామాల్లోని టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షులు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాలో మండల టీడీపీ మాజీ అధ్యక్షులు సుంకర దుర్గారావు, కొయ్యలమూడి చినబాబు, కరుటూరి శ్రీనివాస్, గద్దే సుబ్రహ్మణ్యం, ఓరుగంటి లక్ష్మీపతి రాజు, ఉప్పులూరి రాంబాబు, కొండపల్లి దొరయ్య, కాట్రు భీమరాజు, యాగంటి వెంకటేశ్వరరావు, నందిగం శ్రీధర్, పెనుమత్స సుబ్బరాజు, బొల్లిన భాస్కర్, బళ్లా సూర్యచక్రం పాల్గొన్నారు.

ప్రజలే దేవుళ్లు

గోపాలపురం(నల్లజర్ల): ప్రజలే దేవుళ్లు-సమాజమే దేవాలయం అనే నినాదంతో పేద ప్రజలకు కూడు, గూడునీడ కల్పించిన ఘనత అన్న ఎన్టీఆర్‌దేనని మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్ అన్నారు.

ఎన్టీఆర్ చిరస్మరణీయుడు

గోపాలపురం : తెలుగువారి కీర్తిని ప్రపంచ నలుమూలలా వ్యాపింపజేసిన అన్న ఎన్టీఆర్ చిరస్మరణీయుడని టీడీపీ మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ అన్నారు. మండలంలోని గ్రామగ్రామాన టీడీపీ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పుట్టినరోజు కార్యక్రమాలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రొంగల సత్యనారాయణ, గ్రామకమిటి అధ్యక్షుడు జేష్ఠ శ్రీధర్, మాజీ అధ్యక్షుడు మద్దిపాటి రమేష్, మాజీ ఎంపీటీసీ కూనపోగు ప్రసాదబాబు, పటమటి శ్రీనివాస్, ఈలి శరత్‌బాబు, కుందులనారాయణరావు, ఉండవల్లి దుర్గాప్రసాద్, బాలు, పటమటి గంగరాజు, మల్లిపూడి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జయంతి వేడుకలు నల్లజర్ల మండలంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం నల్లజర్ల ఎన్టీఆర్ జంక్షన్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వల్లూరి సత్తిపండు, కండెపు వెంకటరత్నం, గంటా శ్రీనివాసరావు, యాలమాటి శ్రీనివాస్, విడియాల శ్రీను పాల్గొన్నారు. నల్లజర్ల సెంటర్‌లో సొసైటీ మాజీ అధ్యక్షుడు అల్లాడ రాజారావు, కోరా కన్నయ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహాలకు పూల మాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చీపురుగూడెం ఎంపీటీసీ రావూరి వెంకటరమణ ,పుసులూరి శ్రీనివాసరావు,బేతిన దుర్గారావు,చింతా చైతన్య, సవలం రామకృష్ణ, ముళ్ళపూడి కృష్ణమూర్తి, జాలపర్తి భార్గవ్ పాల్గొన్నారు. చీపురుగూడెంలో జరిగిన టీడీపీ అధ్యక్షుడు చెల్లు పెద్దరామన్న, కూసంపూడి వెంకటేశ్వర రావు, ప్రత్తిపాటి రాంబాబు, మోదుగ సుబ్బారావు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: వేలివెన్ను గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, ఎంపీటీసీలు, వార్డుసభ్యులు, మహిళలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలంగిలో టీడీపీ గ్రామఅధ్యక్షుడు ఈద్పుగంటి ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నివాళులర్పించారు. కాల్ధరి, తాడిపర్రు, సూర్యారావుపాలెం, ఉండ్రాజవరం, వడ్లూరు, చిడిపి, చిలకపాడు తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. కడపలో నిడదవోలు నియోజవర్గానికి కేటాయించిన హాలువద్ద మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చాగల్లులో కేక్ కట్ చేస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ళ హరిబాబు



గోపాలపురం ఎన్టీఆర్ జయంతిలో పాల్గొన్న టీడీపీ నాయకులు



పెరవలి: తీపర్రులో ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



నిడదవోలు పంగిడి రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



తాళ్లపూడిలో ఎన్టీఆర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ పోసిరాజు, సిబ్బంది

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

●ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం



మానికల వెంకన్నబాబు (ఫైలు)

గోపాలపురం(నల్లజర్ల), మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీపురుగూడెం అటవీప్రాంతంలో చెట్టుకు ఒక వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తిమ్మనపాలెం గ్రామానికి చెందిన మానికల వెంకన్నబాబు (35) గతనెల 7వ తేదీ ఉదయం చీపురుగూడెం అటవీప్రాంతంలోకి పశువులను మేపడానికి వెళ్లి సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో భార్య దుర్గ 8వ తేదీన నల్లజర్ల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వ్యక్తి అదృశ్యం కేసుగా నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. చీపురుగూడెం గ్రామానికి చెందిన దానయ్య ఈనెల 27వ తేదీన మేకలను మేపడానికి అటవీ ప్రాంతంలోనికి తోలుకెళ్లగా ఒకచోట వెంకన్నబాబుకు చెందిన సైకిల్, పాదరక్షలు, సెల్‌ఫోన్ గుర్తించి మృతుడి తండ్రి సత్యనారాయణకు తెలిపారు. సమాచారం అందు కున్న పోలీసులు అటవీ ప్రాంతంలో సంఘటన జరిగిన ప్రదేశానికి ఒక చెట్టుకు ఎముకలు వేలాడుతూ శరీరం మొత్తం పాడైయున్న వెంకన్నబాబు మృతదేహాన్ని వారి బంధువుల సహకారంతో కనుగొన్నామన్నారు. మృతుడు వెంకన్నబాబుకు 12, 10ఏళ్ల వయస్సు ఉన్న ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు తెలిపారు. పంచనా మా అనంతరం మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసినట్లు నల్లజర్ల ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

తల్లీ, పిల్ల అదృశ్యంపై కేసు నమోదు

కొవ్వూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): తల్లీ, పిల్ల అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఆర్. సాంబమూర్తి తెలిపారు. మండలంలోని వేమూలూరు గ్రామానికి చెందిన బొరుసు బిందుసాయి మంగ శ్రీలక్ష్మికి గంటి పెదపూడికి చెందిన నాగగణపతి నరసింహస్వామితో వివాహం జరిగింది. మూడు సంవత్సరాల పాప ఉంది. శ్రీలక్ష్మి గత 15 రోజులుగా పుట్టింటిలోనే ఉంటుంది. ఈనెల 27వ తేదీన రాత్రి ఇంటిలో పడుకుందని, ఉదయం లేచి చూసేసరికి కుమార్తె శ్రీలక్ష్మి, మనుమరాలు కనిపించడంలేదని తండ్రి కొటికలపూడి వి.వి.సతీష్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు.

ధ్యానంతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు

● కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి సరస్వతి



యోగాసనాలు వేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బావన

కొవ్వూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు ధ్యానం చేయడంవలన మానశిక దృడత్వంతో పాటు ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చునని కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి జి.వి.ఎల్. సరస్వతి అన్నారు. కొవ్వూరు రామానంద గౌడీయమఠంలో హార్ట్‌ఫుల్‌నెస్ ఆర్గనైజేషన్ సహకారంతో బార్ అసోసియేషన్ ఆధ్వర్యం లో గత మూడురోజులుగా నిర్వహిస్తున్న ధ్యాన శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. హార్ట్‌ఫుల్‌నెస్ ఆర్గనైజేషన్ సభ్యులు రాంబాబు, రమ ణ, సవితలు న్యాయవాదులకు ధ్యానంచేసే విధానాలపై శిక్షణను అందజేశారు. ముఖ్యఅతిథిగా పా ల్గొన్న కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వి.ఎల్. సరస్వతి మాట్లాడుతూ హార్ట్‌ఫు ల్‌నెస్ ఆర్గనైజేషన్ సహకారంతో గత మూడు రోజులుగా న్యాయవాదులకు ధ్యాన శిక్షణా తరగతులు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వర్రే నాగమురళీకృష్ణ, న్యాయవాదులు రాజాన శ్రీనివాస్, బొబ్బా భా రతి, ఎన్వీ సుబ్బారావు, వి.వి.సుబ్బారావు, టి.ఎన్వీ రమణమూర్తి, నీరుకొండ సూర్యనారాయణ, ఉద యభానుజీ, తక్కెళ్ళ చిట్టిబాబు, వి.ఆర్.వి. ప్రసాద్, తాడేపల్లి ప్రభాకర్, యాగంటి చలపతిరావు, వై. ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానశిక ప్రశాంతత

ప్రతిరోజు యోగాసనాలు వేయడం వలన శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి అన్నారు. బుధవారం కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ ఆధ్వర్యంలో స్థానిక సంస్కృత కళాశాల ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భావనరత్నకుమారి, కమిషనర్ నాగేంద్రకుమార్‌లతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు యోగా సాధన చేశారు. మాస్టర్ ట్రైనీలు అల్లూరి కృష్ణారావు, శ్రీనివాసరావు, సరోజినీలు యోగాపై శిక్షణను అందించి, అవగాహన కల్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతిఒక్కరూ ఒత్తిడికి గురవుతున్నారని, అటువంటి వారంతా యోగా సాధనచేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలు, ప్రజా ప్రతినిదులు, ఉద్యోగు లు భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో ఆయుష్ మెడికల్ ఆఫీసర్ కె. శ్రీవిద్య, ఎంఈవో రామకిషోర్, హెల్త్ వర్కర్లు, వార్డు సెక్రటరీలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



పదిలం శ్రీను(ఫైలు)

గోపాలపురం(నల్లజర్ల), మే 28 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కృష్ణంగూడెం గ్రామం శివారులో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణంగూడెం గ్రామానికి చెందిన పదిలం శ్రీను (42) బుధవారంపనికి వెళ్లి వచ్చిన తర్వాత గ్రామశివారులో ఉన్న ఉండ్రాళ్ల చెరువువద్దకు పశువులకు నీరుపెట్టడానికి పక్క రైతు పొలంలో ఉన్న వ్యవసాయ మోటారుకు ఉన్న స్విచ్ ఆన్‌చేయగా విద్యుత్ సరఫరా అయ్యి శ్రీను అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య మహేంద్ర, కుమార్తె శరణ్య, కుమారుడు మణికంఠ ఉన్నట్లు చెప్పారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు, విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలించిన అనంతరం పంచనామా నిర్వహించి, మృత దేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

హెచ్‌డీపీఈ పైపులైన్ నిర్మాణంపై సిబ్బందికి అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ గిరి

కొవ్వూరు, మే 28(ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ పథకంలో చేపట్టే పైపులైను నిర్వహణపై సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. కొవ్వూరు ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం డివిజన్ పరిధిలోని జలజీవన్ మిషన్ పథకంలో చేపట్టిన హెచ్‌డీపీఈ బ్లాక్ పైపులైను నిర్వహణ, మరమ్మతులపై పంచాయతీ స్కీమ్ ఆపరేటర్లకు ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ బి.వి. గిరి మాట్లాడుతూ గ్రామాలలో చేపట్టిన హెచ్‌డీపీఈ బ్లాక్ పైపులైను నిర్వహణ, మరమ్మతులపై డివిజన్ స్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. మండలం నుంచి ఇద్దరుచొప్పున ఎంపికచేసి ముందుగా శిక్షణ అందజేస్తామన్నారు. ప్రస్తుతం గ్రామాలలో పాత పైపులైను స్థానంలో కొత్తగా హెచ్‌డీపీఈ పైపలైను వేస్తున్నారు. కొన్నిచోట్ల పాత పీవీసీ పైపులకు కొత్త పైపులను అనుసందానం చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పాత పైపులకు హెచ్‌డీపీఈ పైపులు జాయింటు చేసే విధానంలో తలెత్తే సమస్యలను పంచాయతీ పిట్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రలను తెలియజేశారు. డీఈలు శ్రీనివాసబాబు, పార్వతి, డివిజన్ పరిధిలోని మండల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

భాగ్యనగర్ పరిశ్రమ కార్మికుల ఆందోళన

గోపాలపురం, మే 28(ఆంధ్రజ్యోతి): గోపాలపురం మండలం గోపవరం గ్రామశివారులో ఉన్న భాగ్యనగర్ ఫ్యాక్టరీ వద్ద కార్మికులు బుధవారం రాత్రి ఆందోళనకు దిగారు. ఎంతో కాలం ఫ్యాక్టరీలో పనిచేస్తూ ఇటీవలే నూతనంగా యూనియన్ ఏర్పాటు చేసుకున్నట్టు తెలిపారు. యూనియన్‌కు వ్యతిరేకంగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఇరువురు యూనియన్ సభ్యులను తొలగించినట్టు తెలిపారు. కార్మికుల అందరూ యూనియన్ సభ్యులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్‌చేస్తూ ఫ్యాక్టరీ గేటు ఎదుట ధర్నాచేశారు. ఈమేరకు సమాచారం అందుకున్న సీఐ నాగేశ్వర నా యక్, ఎస్ఐ సతీష్‌కుమార్ కార్మికులను సమ దాయించారు. ఫ్యాక్టరీ యాజమాన్యంతో మా ట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

భర్త, మామపై కేసు నమోదు

కొవ్వూరు, మే 28(ఆంధ్రజ్యోతి): అధిక కట్నం కోసం వేధిస్తున్న భర్త, మామపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరురూరల్ హెడ్‌కానిస్టేబుల్ భగవాన్‌దాసు తెలిపా రు. కొవ్వూరు మండలం తోగుమ్మి గ్రామానికి చెందిన గొయ్యా సౌజన్యకు, సత్యప్రకాష్‌తో 2024లో వివాహం జరిగింది. భర్త సత్యప్రకాష్, మామ భీమరాజులు అధికకట్నం తీసుకురమ్మని వేధింపులకు గురిచేస్తున్నారని సౌజన్య రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమో దు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ భగవాన్‌దాసు తెలిపారు.

బంగారు వస్తువులు చోరీ

కొవ్వూరు, మే 28 (ఆంధ్రజోతి) : గుర్తుతెలియని వ్యక్తి ఇంటిలో ప్రవేశించి బంగారు వస్తువులు దొంగిలించుకుపోయినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం కొవ్వూరు పట్టణంలోని గౌతమీనగర్‌కు చెందిన గోపరాజు వెంకట సుబ్బలక్ష్మి 75సంవత్సరాల వృద్ధురాలు ఇంటిలో ఒక్కరే ఉంటున్నారు. ఈనెల 27వ తేదీన మధ్యాహ్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఇంటిలో ప్రవేశించి బంగారు గొలుసులు, ఉంగరాలు, చెవిదుద్దులు, నగదు రూ.1200లు చోరీ అయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సెల్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకున్న గ్రామస్థులు

నిడదవోలు, మే 28(ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో బుధవారం ఒక ప్రముఖ కంపెనీకి చెందిన సెల్‌టవర్ నిర్మాణానికి పనుల ప్రారంభించగా ఎటువంటి అనుమతులు లేకుండా టవర్ నిర్మించడానికి వీల్లేదంటూ గ్రామస్థులు అడ్డుకున్నారు. జనావాసాల మధ్య సెల్‌టవర్ నిర్మిస్తే చిన్నారులు వృద్ధులకు అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందంటూ ఆ ప్రాంతవాసులు ధర్నా నిర్వహించారు.

మెరుగైన వైద్య సేవలందిస్తాం

నిడదవోలు, మే 28(ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తాడిమళ్ళ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్రమంత్రి కందుల దుర్గేష్ ఆకస్మిక తనిఖీచేసి పీహెచ్‌సీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటన ద్వారా వివరణ ఇచ్చారు. తాడిమళ్ళ ప్రాథమిక వైద్య కేంద్రంలో ఇకపై ఎటువంటి వైద్య సేవలలో లోపం లేకుండా చూసుకుంటామని మంత్రి దుర్గేష్ ఇచ్చిన సూచనల మేరకు మెరుగైన వైద్య సేవలు కల్పిస్తామన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ ఏలూరు వెళ్ళిన కారణంగా మంగళవారం అందుబాటులో లేకుండా పోయారని ఆయన వివరణ ఇచ్చారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

● హౌసింగ్ ఈఈ చంద్రశేఖర్



కార్యక్రమంలో మాట్లాడుతన్న హౌసింగ్ ఈఈ చంద్రశేఖర్

తాళ్లపూడి, మే 28(ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాల్సిన బాధ్యత సిబ్బంది తీసుకోవాలని హౌసింగ్ ఈఈ చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో వారికి కేటాయించిన టార్గెట్‌లను పూర్తి చేయాలని తెలిపారు. మండలంలో 154 ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని వాటిలో 83 ఇ ళ్లు పూర్తి కాగా మిగిలిన ఇళ్లు పూర్తి కావడానికి పలు సూచనలు చేశారు. అనంతరం అన్నదేవరపేట గ్రామంలో నిర్మాణదశలో ఉన్న కొన్ని ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ శేఖర్‌బాబు, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

● పది మందిపై కేసు నమోదు

కొవ్వూరు, మే 28 (ఆంధ్రజోతి): ఆస్తి సరిహద్దు తగాదాలను పురస్కరించుకుని ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న సంఘటనపై ఇరువర్గాలకు చెందిన పదిమందిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ జి.జి.ప్రకాస్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వేములూరు గ్రామానికి చెందిన బలుసు రమేష్, బలుసు రవిలకు ఆస్తి సరిహద్దు తగాదాలు ఉన్నాయి. ఈనెల 27వ తేదీన రాత్రి బలుసు రమేష్‌ని రవి, అతని బంధువులు మొత్తం అయిదుగురు కలిసి రమేష్, బంధువు అయిన ఉప్పులూరి నళినికుమారిపై దాడిచేసి కర్రలతో కొట్టి గాయపర్చారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు రవి, అతని అనుచరులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు. అదేవిధంగా బలుసు రవిని బలు సు రమేష్, అతని బంధువులు మొత్తం అయిదుగురు కలిసి కర్రలతో దాడి చేసి కొట్టి గాయపర్చారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు రమేష్ అతని, అనుచరులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.